మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
దినపత్రిక
NETI EVARTHALU

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 24-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 175 Issue: 175

24 డిసెంబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:46 సూర్యాస్తమయం - సా. 5:44 తిథిః చవితి మ. 1:08 వరకు తరువాత పంచమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం శ్రవణ ఉ. 6:59 వరకు తరువాత ధనిష్ఠ యోగం హర్షణ మ. 3:54 వరకు కరణం విష్టి మ. 1:08 వరకు బవ రా. 1:28ం వరకు వర్జ్యం ఉ. 11:19 నుండి మ. 1:00 వరకు దుర్ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:37 వరకు రాహుకాలం మ. 12:15 నుండి మ. 1:37 వరకు యమగండం ఉ. 8:09 నుండి ఉ. 9:31 వరకు గుళికాకాలం ఉ. 10:53 నుండి మ. 12:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:10 నుండి తె. 5:58 వరకు అమృత ఘడియలు రా. 9:22 నుండి రా. 11:03 వరకు అభిజిత్ ముహూర్తం లేదుజ గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




# తాగండి.. తూలండి!

**డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 వరకు వైన్స్ ఓపెన్**

**బార్లు, క్లబ్బులకు రాత్రి 1 గంట వరకు అనుమతి**

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మద్యం విక్రయదారులు, వినియోగదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): 2026 డిసెంబర్ 31వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనే అవకాశం ఉన్నందున, మద్యం విక్రయాల వేళలను పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక జీవోను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాష్ట్రంలోని అన్ని వైన్ షాపులు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు అమ్మకాలు జరుపుకోవడానికి వెసులుబాటు కల్పించింది. ఇక బార్లు, క్లబ్బులు, టూరిజం ప్రాంతాల్లోని హోటళ్లు, అలాగే ప్రత్యేకంగా అనుమతి పొందిన ఈవెంట్ నిర్వాహకులకు రాత్రి 1 గంట వరకు మద్యం సరఫరా చేయడానికి, తరువాయి 2 వ పేజీలో...



# రండి.. విందు ఆరగించండి!

**ఎమ్మెల్యే కొడుకు రిసెప్షన్‌కు 30 వేల మంది అతిథులు**

మధ్యప్రదేశ్‌లోని రాయ్‌సెన్‌లో జరిగిన ఓ వివాహ వేడుక దాదాపు 30,000 మందికి ఆతిథ్యమిచ్చింది. ఈ వేడుకలో వెయ్యి మంది వంటవాళ్లు పాల్గొన్నారు.

భోపాల్: సాంచి ఎమ్మెల్యే డాక్టర్ ప్రభు రామ్ చౌదరి పెద్ద కుమారుడు పర్వ్ చౌదరి వివాహం ఇటీవల భోపాల్‌లో నిరాడంబరంగా జరిగింది. రిసెప్షన్‌ను మాత్రం రాయ్‌సెన్‌లో భారీ ఎత్తున నిర్వహించారు. రాయ్‌సెన్‌లో సుమారు ఎనిమిది ఎకరాల్లో వేదికను ఏర్పాటు చేశారు. ప్రముఖుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, శివరాజ్ సింగ్ చౌహాన్, మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీశ్ దేవ్డా, మంత్రి గోవింద్ సింగ్ రాజ్‌పుత్, ఇతర సీనియర్ నేతలు ఈ వేడుకలో పాల్గొన్నారు. ముప్పై వేల మంది అతిథుల కోసం వెయ్యి మంది తరువాయి 2 వ పేజీలో...



# మూడ్నెల్లకోసారి రివ్యూ

**అధికారులు సమన్వయం తప్పనిసరి**

**పనితీరుపై నెలనెలా సీఎస్ సమీక్ష**

**కార్యదర్శులు ప్రతి నెల రిపోర్టివ్వాలి**

**స్పెషల్ సెక్రటరీలతో సీఎం రేవంత్**

'ఎంత గొప్ప కార్యాచరణ తీసుకున్నా అధికారుల సహకారం ఉండాలి. అధికారులు జవాబుదారీతనం తో పని చేయాలి. ప్రతీ నెల కార్యదర్శుల పనితీరుపై సీఎస్ సమీక్షిస్తారు. కార్యదర్శులు సీఎస్‌కు ప్రతీ నెల రిపోర్ట్ సమర్పించాలి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి మీ పనితీరుపై నేనే స్వయంగా సమీక్షిస్తా. ఆయా శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి ఫలితాలు రావు. అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయడం అత్యంత కీలకం.

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): తెలంగాణ అభివృద్ధి విషయంలో శాఖల మధ్య సమన్వయం చేసుకునేందుకు ఒక మెకానిజం ఏర్పాటు చేసుకోవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు. ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు తరువాయి 2 వ పేజీలో...



# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు నోటీసులు?

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ గా మారింది. దీనిపై సిట్ దర్యాప్తు సంస్థ స్పీడ్ ను పెంచింది. ఈక్రమంలో సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తొమ్మిది మంది పోలీసుల టీంను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఏ సమయంలో అయిన కేసీఆర్‌కు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌కు నోటీసులు జారీ చేసే చాన్స్ ఉందని వార్తలు గుప్పుమంటున్నాయి.

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ తరువాయి 2 వ పేజీలో...

# 'చెక్' పవర్ తీసేసి.. తీయలేదన్నారు!

**వాళ్లు ఐఏఎస్‌లు.. పొరపాటే చేశారట**


**సర్కారుపై వ్యతిరేకత రావడంతో దిద్దుబాటు**

**ఉప సర్పంచ్ స్థానంలో పొరపాటు అని రిజాయిండర్**



మంగళవారం ఉదయమే ప్రభుత్వ ఉత్తర్వులు.. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ చెల్లింపులు జరుగుతాయని దాని సారాంశం. ఒక్కసారిగా, ఈ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది.

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): తూచ్.. అదంతా తప్పుడు ప్రచారం, ఉప సర్పంచుల చెక్ పవర్‌ను తొలగించలేదని తెలిపింది. కాసేపటికే, సరిదిద్దిన ఉత్తర్వులు ఇస్తామని పంచాయతీ రాజ్ శాఖ తెలిపింది. అన్నట్లుగానే సాయంత్రానికి రీజాయిండర్ విడుదల చేసింది. అందులో.. పొరపాటున పంచాయతీ కార్యదర్శి అని పడిందని తరువాయి 2 వ పేజీలో...




## గూగుల్ 'ఎమర్జెన్సీ లొకేషన్ సర్వీస్'

2

## క్రెడిట్ కార్డుతో వ్యాలెట్ లోడ్ చేస్తే బాదుడే

**కొత్త సంవత్సరంలో ఐసీఐసీఐ కొత్త బాదుడు**

2


## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,855 |
| వెండి (గ్రాము): | రూ.234 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,285 |

# ఐఏఎస్, ఐపీఎస్‌లకు ప్రమోషన్లు

**రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

రాష్ట్ర పాలనా యంత్రాంగంలో కీలకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 2026 నూతన సంవత్సరానికి ముందే ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణ రావు గవర్నర్ ఆదేశాల మేరకు ఈ నియామకాలను ఖరారు చేశారు. మంగళవారం 11 మంది ఐఏఎస్ అధికారులకు ప్రమోషన్ లభించింది. రాష్ట్రంలో పని చేస్తున్న 2013 బ్యాచ్ ఐఏఎస్‌లకు అడిషనల్ సెక్రటరీ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.




హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): పదోన్నతి పొందిన వారిలో శశాంక్, అద్వైత్ సింగ్, శృతి ఓజా, శ్రీజన, వినయ్, వాసం వెంకటేశ్వర్, శివలింగయ్య, హన్మంతరావు, హైమావతి, ఎం హరిత, కే హరిత ఉన్నారు. అంతకుముందే..1996 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం అపెక్స్ స్కేల్ (లెవల్-17) కేటాయించింది. ఇది ఐఏఎస్ సర్వీసులో అత్యున్నత స్థాయి హోదాగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఇంధన శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్న నవీన్ మిట్టల్ అదే శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ) గా పదోన్నతి పొందారు. విద్యుత్తు రంగాన్ని పటిష్ఠం చేయడంలో ఆయన చేసిన కృషికి ఈ పదోన్నతి గుర్తింపుగా నిలిచింది. కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న దాన కిశోర్‌ను కూడా అదే శాఖలో ప్రత్యేక తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చాకోలెట్ ముడి పదార్థమైన కొకోవా గింజలు 70 శాతం పశ్చిమ ఆఫ్రికా నుంచే ఎగుమతి అవుతాయి. ఒక్క ఐవరీ కోస్ట్ నుంచే 45 శాతం గింజలు ఉత్పత్తి అవుతాయి. ఆ తర్వాతి స్థానంలో ఘనా (20 శాతం) ఉంది.

# రేవంత్‌వి డ్రామాలు

**నదీజలాలపై సీఎంకు అవగాహన శూన్యం**

**సాగునీటి మంత్రిది అంతులేని అజ్ఞానం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



నదీ జలాలు, రాష్ట్ర సంక్షేమ పథకాలు, హామీల అంశం కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కేసుల డ్రామాలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. నదీ జలాలపై రేవంత్ రెడ్డికి అవగాహన శూన్యం.. సాగునీటి మంత్రులది అంతులేని అజ్ఞానం అని చెప్పారు. కేసులు, బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ లొంగదని ప్రకటించారు.

నల్లగొండ, డిసెంబర్ 23 (ఈవార్తలు): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ అడ్డుకుంటోందని.. తెలంగాణ రైతుల కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి '420' హామీల భయం.. అందుకే ఎన్నికల నిర్వహణ నుండి పరారైందని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. నల్లగొండ జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ సభ్యుల అభినందన సభ నల్లగొండ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రజాప్రతినిధులను అభినందించి సన్మానించారు. అనంతరం మాజీతరువాయి 2 వ పేజీలో...



## తులం బంగారం రూ.1,38,550

బంగారం ధరలు సరికొత్త రికార్డులు సృష్టిస్తూ సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,38,550 పలికి, సరికొత్త ఆల్ టైమ్ గరిష్ఠాన్ని నమోదు చేసింది. పసిడి ధరల పరుగు దేశవ్యాప్తంగా ఇదే రీతిలో తరువాయి 2 వ పేజీలో...

# ఆ ఖాకీల తాటతీస్తాం

**ఎక్స్‌ట్రా చేస్తున్న పోలీసుల పేర్లు రాసుకుంటున్నం**

**ఎట్టిపరిస్థితుల్లోనూ వాళ్లను వదిలిపెట్టం**

**మాజీమంత్రి హరీశ్ రావు హెచ్చరిక**



'లీకులు కొట్టినా.. ఎన్ని కేసులు పెట్టినా.. రేవంత్ రెడ్డిని వదిలే ప్రసక్తే లేదు. అసెంబ్లీ అయిపోయిన సాయంత్రమే.. రేవంత్ నాకు నోటీసు ఇవ్వమన్నాడట. రాష్ట్రం తెచ్చినోళ్లం.. త్యాగాల చరిత్ర మాది. రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్ళకు భయపడం. ఇంకా గట్టిగా పనిచేస్తాం' అని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. ఎక్స్‌ట్రాలు చేస్తోన్న పోలీసులు పేర్లు రాసుకుంటున్నామని.. వదిలిపెట్టమని హెచ్చరించారు.

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): రూల్ బుక్, కాఖీ బుక్కు కొందరికేనా? అని డీజీపీ శివధర్ రెడ్డిని ప్రశ్నించారు. 'రిటైర్ అయినా.. విదేశాల్లో ఉన్నా.. డిప్యూటేషన్ పై సెంట్రల్ సర్వీస్ కు పోయినా.. అతి చేస్తోన్న పోలీస్ అధికారులను గుంజుకొస్తాం. కాఖీ పుస్తకం ఎవరి కోసమో.. డీజీపీ శివధర్ రెడ్డి చెప్పాలి' అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా సర్జాపూర్ లో ఓటేయలేదని ఇల్లు కూల గొడితే.. కనీసం ఫిర్యాదు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇదేనా పోలీసులు పనితీరు అని డీజీపీ శివధర్ రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

24.12.2025

మేషం: కొన్ని వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలిసి రావు. దూర ప్రయాణాల వలన శారీరక శ్రమ అధికం అవుతుంది. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. బంధుమిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు ఉంటాయి.

వృషభం: నిరుద్యోగులకు ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తాయి. స్నేహితుల నుండి కీలక విషయాలు సేకరిస్తారు. విలువైన వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగస్తులకు అధికారులతో చర్చలు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మిధునం: సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో శ్రమ ఫలిస్తుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ఆర్థిక పురోగతి కలుగుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకం: దైవసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఇంటా బయట ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి విమర్శలు అధికమవుతాయి. దీర్ఘకాలిక ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

సింహం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు ఉంటాయి. వాహన ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగయత్నాలు వాయిదా పడతాయి. వ్యాపార, ఉద్యోగాలలో స్వల్ప చికాకులు తప్పవు. కుటుంబ సభ్యుల నుండి వినకూడని మాటలు వినవలసి వస్తుంది. నూతన రుణాలు చేస్తారు.

కన్య: ఆర్థిక పరిస్థితి ఆశించిన విధంగా ఉంటుంది. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. ఉద్యోగస్తులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు సంతృప్తినిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు సజావుగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలు లాభాల బాట పడతాయి.

తుల: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన పనులు అనుకున్న రీతిలో పూర్తి చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారమవుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలు లోటుండదు.

వృశ్చికం: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఇంటాబయటా ఒత్తిడులు పెరుగుతాయి. ధన పరంగా కొంత ఇబ్బందులు తప్పవు. నూతన ఋణప్రయత్నాలు కలిసిరావు. ముఖ్యమైన వ్యవహారాలు మందగిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరాశాజనకంగా ఉంటాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

ధనస్సు: రాజకీయ ప్రముఖుల తో చర్చలు సఫలం అవుతాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. గృహంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది.

మకరం: సంతాన వివాహ విషయమై గృహమున చర్చలు జరుగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. రాజకీయ సంబంధిత సభ సమావేశాలలో పాల్గొంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

కుంభం: దూరప్రయాణాలు వాయిదా పడతాయి. ముఖ్యమైన పనులు వ్యయప్రయాసలతో గాని పూర్తికావు. ఉద్యోగయత్నాలు వాయిదా వేస్తారు. సోదరుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. మిత్రులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది.

మీనం: సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతారు. నిరుద్యోగులు ఇంటర్వ్యూలలో పాల్గొని విజయం సాధిస్తారు.

# గూగుల్ 'ఎమర్జెన్సీ లొకేషన్ సర్వీస్'

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్ భారతదేశంలోని ఆండ్రాయిడ్ వినియోగదారుల కోసం అత్యంత కీలకమైన 'ఎమర్జెన్సీ లొకేషన్ సర్వీస్'ను మంగళవారం ప్రారంభించింది. ఈ అధునాతన టెక్నాలజీని తమ 112 అత్యవసర సేవలతో పూర్తిస్థాయిలో అనుసంధానం చేసుకున్న తొలి రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ నిలిచింది. ఈ విషయాన్ని గూగుల్ ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించింది. ఈ కొత్త ఫీచర్ ఆండ్రాయిడ్ ఫోన్లలో అంతర్నిర్మితంగా పనిచేస్తుంది. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేసినా లేదా ఎస్ఎమ్ఎస్ పంపినా, వారి కచ్చితమైన లొకేషన్ ఆటోమేటిక్‌గా సహాయక బృందాలకు చేరుతుంది. ఇందుకోసం ఫోన్‌లోని జీపీఎస్, వై-ఫై, మొబైల్ నెట్‌వర్క్ సిగ్నల్స్‌ను ఉపయోగించుకుంటుంది. దీనివల్ల దాదాపు 50 మీటర్ల కచ్చితత్వంతో బాధితులు ఎక్కడున్నారో గుర్తించడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా, ఆపదలో ఉన్నవారు కాల్ చేసిన కొద్ది క్షణాలకే కనెక్షన్ కట్ అయినా ఈ టెక్నాలజీ పనిచేస్తుంది. వారి లొకేషన్ వివరాలు అప్పటికే ఎమర్జెన్సీ కేంద్రానికి చేరిపోతాయి. దీంతో సహాయక బృందాలు వేగంగా సంఘటనా స్థలానికి చేరుకోవచ్చు. వినియోగదారుల ప్రైవసీకి పూర్తి భద్రత ఉంటుందని గూగుల్ స్పష్టం చేసింది. కేవలం ఎమర్జెన్సీ కాల్స్ చేసినప్పుడు మాత్రమే ఈ ఫీచర్ యాక్టివేట్ అవుతుందని, లొకేషన్ వివరాలు నేరుగా సహాయక కేంద్రానికే వెళతాయని, గూగుల్ ఈ డేటా సేకరించడం గానీ, స్టోరేజిలో సేవ్ చేయడం గానీ చేయదని తెలిపింది. ఈ సర్వీస్ కోసం ఎలాంటి




ప్రత్యేక యాప్స్ లేదా హార్డ్‌వేర్ అవసరం లేదు. ఆండ్రాయిడ్ 6.0 లేదా ఆ తర్వాతి వెర్షన్ ఉన్న అన్ని ఫోన్లలోనూ ఇది ఉచితంగా పనిచేస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో పూర్తిస్థాయిలో ప్రారంభించడానికి ముందు కొన్ని నెలల పాటు పైలట్ ప్రాజెక్టును విజయవంతంగా పరీక్షించారు. ఈ సమయంలో సుమారు 2 కోట్ల ఎమర్జెన్సీ కాల్స్, ఎస్ఎమ్ఎస్ లకు ఈ ఫీచర్ ద్వారా లొకేషన్‌ను కచ్చితంగా గుర్తించారు.

# ఐఏఎస్, ఐపీఎస్‌లకు ప్రమోషన్లు

**మొదటి పేజీ తరువాయి**

ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ ఇద్దరు అధికారులు 2026 జనవరి 1వ తేదీ నుండి లేదా వారు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ హోదాలో కొనసాగుతారు. అపెక్స్ స్కేల్ అనేది కేబినెట్ సెక్రటరీ స్థాయికి ఇంచుమించు సమానమైన జీతభత్యాలు, అధికారాలను కలిగి ఉంటుంది.

అటు.. పోలీస్ విభాగంలో కూడా ప్రభుత్వం భారీగా పదోన్నతులు కల్పించింది. 2012 బ్యాచ్ కు చెందిన ఆరుగురు ఐపీఎస్ అధికారులను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీఐజీ) స్థాయికి ఎంపానెల్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్ శ్వేత.. హైదరాబాద్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా కొనసాగుతూనే డీఐజీ హోదాను పొందారు. ప్రస్తుతం సివిల్ ఇంటెలిజెన్స్ విభాగంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఉన్న ఆర్. భాస్కరన్‌కు డీఐజీ స్థాయి లభించింది. సికింద్రాబాద్ రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్న చందన దీప్తికి కూడా పదోన్నతి కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న కల్మేశ్వర్ శింగెనవర్ డీఐజీ స్థాయికి ప్రమోట్ చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా ఉన్న ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు పదోన్నతి లభించింది. రోహిణి ప్రియదర్శినికి కూడా డీఐజీ హోదాను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా 2026 జనవరి 1 నుంచి కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు.

## తాగండి.. తూలండి!

**మొదటి పేజీ తరువాయి**

సేవించడానికి అనుమతినిచ్చారు. అయితే, ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకుని ఎలాంటి అక్రమాలు జరగకుండా ఎక్సైజ్ శాఖ అత్యంత కఠినమైన నిఘాను ఏర్పాటు చేసింది. ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ గారి ఆదేశాల మేరకు, డిసెంబర్ 27వ తేదీ నుండే రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు, డ్రైవ్స్ ప్రారంభం కానున్నాయి.

## 'చెక్' పవర్ తీసేసి..

**మొదటి పేజీ తరువాయి**

వివరణ ఇచ్చింది. 'నూతనంగా ఏర్పాటైన మండలాలు, గ్రామపంచాయతీల్లో 15వ ఫైనాన్స్ కమిషన్ పథకానికి సంబంధించి కొత్త బ్యాంక్ అకౌంట్లు తెరుచుటకు ఆదేశాలు ఇవ్వనైనది. ఆ ఆదేశాల్లో ఉప సర్పంచ్ స్థానంలో పొరపాటున పంచాయతీ కార్యదర్శి అని రాయడం జరిగింది. తర్వాత ఈ విషయాన్ని గ్రహించి సవరణ ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అంతేకానీ, ఉపసర్పంచులకు చెక్ పవర్ తీసేయలేదు అని గ్రహించాల్సిందిగా కోరుతున్నాం' అని 'తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం రీజాయిండర్ విడుదల చేసింది. అయితే, ఈ రీజాయిండర్‌పైనే నెట్టింట్లో జోకులు పేలాయి. పెద్ద పెద్ద ఐఏఎస్ ఆఫీసర్లు విడుదల చేసే ఉత్తర్వుల్లో ఉప సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి తేడా తెలియకుండా ఉంటారా? అని ప్రశ్నల వర్షం కురుస్తోంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు?

**మొదటి పేజీ తరువాయి**

ట్యాపింగ్ తో ఎన్నో కుటుంబాల్లో చిచ్చు రగిలిందన్నారు. రాజకీయ నేతలు.. చివరకు కన్నకూతురు, అల్లుడి ఫోన్ లను ట్యాప్ చేయించి ఎస్ఐబీ వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. అదే విధంగా అనేక మంది కాంట్రాక్టర్లు, నేతల్ని బ్లాక్ మెయిల్ చేసి వసూళ్లకు తెరతీశారన్నారు. కేవలం నోటీసులు జారీ చేయడం మాత్రమే కాదని, దోషులను కూడా తేల్చాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. సంవత్సరాలకు తరబడి ఎపిసోడ్‌లా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడుస్తుందన్నారు. సిట్ అధికారులకు, ఇతర అధికారులకుఫోన్ ట్యాపింగ్ కేసులో అధికారులకు ఒత్తిడి లేకుండా వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని రేవంత్ ప్రభుత్వాన్ని కోరారు. దీని వెనకాల ఉన్న సూత్రధారులు, పాత్ర దారుల్ని చట్టం ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

# రండి.. విందు ఆరగించండి!

**మొదటి పేజీ తరువాయి**

వంటవాళ్లు దేశీ, విదేశీ వంటకాలను సిద్ధం చేశారు. రాయ్‌సెన్‌లో ఇంత పెద్ద వేడుక ఎప్పుడూ జరగలేదని స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుమారుడి వివాహ వేడుక కొద్దిరోజుల క్రితం చాలా నిరాడంబరంగా జరిగింది. ముఖ్యమంత్రి చిన్న కుమారుడు డాక్టర్ అభిమన్యు తన చిరకాల స్నేహితురాలు డాక్టర్ ఇషితా పటేల్‌ను ఆదివారం ఉజ్జయినిలో వివాహం చేసుకున్నారు. బాబా రామ్‌దేవ్ మంత్రాలు చదువుతుండగా పూలదండలు మార్చుకుని నిరాడంబరంగా వివాహ తంతును ముగించారు.

## మూడ్నెల్లకోసారి రివ్యూ

**మొదటి పేజీ తరువాయి**

ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హెచ్‌వోడీలు వెరిఫై చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని ఆదేశాలు జారీ చేశారు. 'ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయి. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని పేర్కొన్నారు.

## తులం బంగారం రూ.1,38,550

**మొదటి పేజీ తరువాయి**

కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజే రూ.2,650 పెరిగి రూ.1,40,850కి చేరింది. ఈ ఒక్క ఏడాదిలోనే పసిడి ధర ఏకంగా రూ.61,900 మేర పెరగడం గమనార్హం. 2024 డిసెంబర్ 31న రూ.78,950గా ఉన్న ధర, ఇప్పుడు 78 శాతం వృద్ధితో లక్షన్నర రూపాయల మార్కు దిశగా దూసుకెళుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా పరుగులు పెడుతోంది. ఢిల్లీలో కిలో వెండి ధర ఒక్కరోజులో రూ.2,750 పెరిగి రూ.2,17,250కి చేరింది. ఈ క్యాలెండర్ సంవత్సరంలో వెండి ధర ఏకంగా 142 శాతానికి పైగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 4,500 డాలర్లకు, వెండి 70 డాలర్లకు చేరడమే దేశీయ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని నిపుణులు చెప్తున్నారు.

# రేవంత్‌వి డ్రామాలు

**మొదటి పేజీ తరువాయి**

మంత్రి కేటీఆర్ సంచలన ప్రసంగం చేశారు. దమ్ముంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ చేశారు. ఓటమి భయంతోనే నామినేటెడ్ పదవుల భర్తీ అని.. ఎన్నికలు పెడితే రైతులు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం అని తెలిపారు. అర్జునుడి లక్ష్యంలా హామీల అమలుపైనే గురి పెట్టాలని.. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉంటే వెంటనే సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే, వెనుక నుంచి లీకులు ఇవ్వడం మానేసి.. నేరుగా కెమెరా ముందుకు వచ్చి ఏ కేసు పెడుతున్నారో చెప్పాలని మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. హోం మంత్రి కూడా ఆయనే కాబట్టి, ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని, శిఖండి రాజకీయాలు చేయడం తగదని విమర్శించారు. ప్రజా ప్రయోజనాల కంటే కేవలం కేసుల చుట్టూనే ప్రభుత్వాన్ని తిప్పుతున్నారని.. కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రజల దృష్టి మళ్లించడానికి నోటీసుల డ్రామా ఆడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, రైతు బంధు వంటి హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే రేవంత్ రెడ్డి ఇదంతా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై మంత్రుల అజ్ఞానంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డికి నీళ్లపై కనీస అవగాహన లేదని.. మరో మంత్రి వాటర్‌లో నీళ్లు అని మాట్లాడే అజ్ఞాని అంటూ కోమటిరెడ్డిని ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలు, సాగునీటి అవసరాలు తెలియని వారు అడ్డదారిలో అధికారంలోకి వచ్చి హుంకరిస్తున్నారని, అబద్ధాలు చెప్పి గందరగోళం సృష్టించడం తప్ప వీరికి ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు.

## ఆ ఖాకీల తాటతీస్తాం

**మొదటి పేజీ తరువాయి**

సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఆరోగ్య భద్రత లక్షకు కుదించారని కానిస్టేబుల్స్ కు నా దగ్గరకొచ్చి కళ్ల నీళ్లు పెట్టుకున్నారు. డీజీపీ శివధర్ రెడ్డి కానిస్టేబుల్స్ అలవెన్స్‌లు, టీఏ, డీఏలపై దృష్టి పెట్టాలి' అని హరీశ్ రావు సూచించారు. 'అసెంబ్లీలో మా గొంతు నొక్కడం.. మైక్ కట్ చేయవద్దు. ఎవరి వాదన నిజమో ప్రజలు తేల్చుతారు. సీపీఐ, ఎంఐఎం, బీజేపీ కంటే తక్కువ సమయం బీఆర్ఎస్ పార్టీకి ఇస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రభుత్వం భయపడుతుంది. అవకాశం ఇస్తే అసెంబ్లీలో రేవంత్ రెడ్డి బట్టలు విప్పుతాం' అని మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. బాంబే బ్రోకర్‌ను పెట్టి అప్పులు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేని స్పష్టం చేశారు. 'ఒక్క కేసులోనే రేవంత్ రూ.180 కోట్లు కమీషన్ ఇచ్చాడు. బ్రోకర్ సలహాలతో రేవంత్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. బ్రోకర్ సూచనలతోనే జీహెచ్‌ఎంసీని మూడు ముక్కలు చేస్తున్నారు. బ్రోకర్‌లను పెట్టి ఆస్తులను తాకట్టు పెట్టి అధిక వడ్డీకి అప్పులు తెస్తున్నారు. కృష్ణా నదీ జాలాల్లో కాంగ్రెస్ సర్కార్ వాడిన నీటి వాడకం 28.49 శాతం మాత్రమే' అని తెలిపారు. 'సమస్యలు, వివాదాలను డైవర్ట్ చేయటంలో మొనగాడు. కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు ఒక్కదానికి కూడా రేవంత్ రెడ్డి సమాధానం ఇవ్వలేదు. ప్రభుత్వం ఇరుకున పడిన ప్రతిసారీ.. ఒక లీక్ ఇస్తున్నారు. ఇందులో భాగంగానే ఫార్ములా ఈ రేస్.. ఫోన్ ట్యాపింగ్ కేసు' అని మాజీ మంత్రి హరీశ్ రావు వివరించారు. అసెంబ్లీ అయిపోగానే .. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు నోటీసులు ఇస్తారట.. ఇది డైవర్ట్ కోసమేనని ప్రకటించారు. 'బీఆర్ఎస్ పార్టీని తిట్టడం కోసమే అసెంబ్లీ సమావేశాలు. కాంగ్రెస్ సర్కార్ వేస్తోన్న సిట్ పెద్ద జోక్. ఒకరిద్దరు పోలీస్ అధికారులు పోస్టింగ్‌ల కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. రేవంత్ మెప్పు కోసం.. అక్రమ కేసులు పెడుతోన్న వారికి హెచ్చరిక. ఏపీలో సీనియర్ పోలీస్ అధికారులకు పట్టిన గతే మీకు పడుతుంది. రేవంత్ నాపై అక్రమ కేసులు పెడుతున్నాడు' అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజా సమస్యలు పట్టించుకోరు కానీ ఎంతసేపు ఎవరికీ నోటీసులు ఇవ్వాలి అని చూస్తారు. రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ ఆడితే దానిపైన ఉన్న ప్రేమ ఒకమాట దళిత బిడ్డ చనిపోతే దాని మీద ప్రేమ లేదా? డీజీపీ' అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. 'కానిస్టేబుల్, హోంగార్డులు సమస్యలు పట్టించుకోరు, వారి భద్రత చూడరు. ఫుడ్ పాయిజన్ అయ్యే ఆసుపత్రులు అడ్మిట్ అయితే పాతయించుకోరు. నేను పోయి చూసి వచ్చిన తరవాత ప్రభుత్వం కదిలింది. హైదరాబాద్ నగరంలో కూడా ఫుడ్ పాయిజన్ సంఘటనల జరుగుతున్నాయి. చట్టాన్ని అతిక్రమించి పని చేసే అధికారులు రిటైర్మెంట్ అయినా, విదేశాలు ఉన్న పట్టుకొస్తాం' అని పోలీసులకు మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. చట్టబద్దంగా పని చేయాలని హితవు పలికారు.

## విద్య, ఉద్యోగవాణి

స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్

మొత్తం పోస్టులు: 549

అర్హత: పది ఉత్తీర్ణులై, క్రీడల్లో అనుభవం గలవారు

వయోపరిమితి: 18-23 ఏళ్ల మధ్యగల వారు

దరఖాస్తు తేదీలు: డిసెంబర్ 27-జనవరి 15 వరకు

ఎంపిక విధానం: పీఎస్‌టీ, స్పోర్ట్స్ ప్రదర్శన, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ద్వారా

వెబ్‌సైట్: rectt.bsf.gov.in/

# క్రెడిట్ కార్డుతో వ్యాలెట్ లోడ్ చేస్తే బాదుడే

**కొత్త సంవత్సరంలో ఐసీఐసీఐ కొత్త బాదుడు**

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ క్రెడిట్ కార్డ్ వాడుతున్న వారికి కొత్త ఏడాదిలో చార్జీల మోత మోగనుంది. ఆన్ లైన్ గేమింగ్, యూపీఐ వ్యాలెట్ లలో నగదు జమ చేస్తే చార్జీ వసూలు చేయనున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ పేర్కొంది. క్రెడిట్ కార్డ్ చార్జీలలో పలు మార్పులు చేయనున్నట్లు ప్రకటించింది. రివార్డు పాయింట్ల విషయంలోనూ పలు మార్పులు చేయనుంది. వచ్చే ఏడాది జనవరి%-% ఫిబ్రవరి మధ్య కాలంలో ఈ మార్పులను విడతలవారీగా అమలులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్ ఫారమ్ లలో జరిపే క్రెడిట్ కార్డు లావాదేవీలపై 2 శాతం, అమెజాన్ పే, పేటీఎం వంటి వ్యాలెట్లలో రూ.5 వేల కంటే ఎక్కువ నగదును లోడ్ చేస్తే 1 శాతం, రూ. 50 వేలకు మించి చేసే ట్రావెలింగ్ ఖర్చులపై 1 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ఐసీఐసీఐ తెలిపింది. అంతేకాదు, ఐసీఐసీఐ బ్రాంచ్ లలో క్రెడిట్ కార్డ్ బిల్లును నగదు రూపంలో చెల్లిస్తే రూ.150 అదనంగా సమర్పించుకోవాల్సిందే. 'ఎమెరాల్డ్ మెటల్' వంటి ప్రీమియం కార్డ్ ద్వారా ప్రభుత్వ సేవలు, ఫ్యూయెల్, రెంట్, పన్ను, వ్యాలెట్ లావాదేవీలు జరిపినపుడు గతంలో కస్టమర్లు రివార్డు పాయింట్లు పొందేవారు. ఇకపై ఈ రివార్డులు పూర్తిగా నిలిపివేయనున్నట్లు బ్యాంక్ తెలిపింది. రవాణా ఖర్చుల కోసం కార్డు వాడితే నెలకు రూ.20 వేల వరకు మాత్రమే రివార్డ్ పాయింట్లు పొందవచ్చని వివరించింది. యాడ్ ఆన్ కార్డు కోసం రూ.3,500 వసూలు చేయనున్నట్లు పేర్కొంది. బుక్ మై షోలో 'ఒకటి కొంటే ఒకటి ఉచితం' ఆఫర్ పొందాలంటే గడిచిన మూడు నెలల్లో కార్డుపై కనీసం రూ.25 వేలు ఖర్చు చేసి ఉండాలని బ్యాంకు షరతు విధించింది. ఇన్ స్టంట్ ప్లాటినం కార్డ్ హోల్డర్లకు ఫిబ్రవరి నుంచి ఈ ఆఫర్ పూర్తిగా నిలిపివేయనున్నట్లు ప్రకటించింది.

# జీవో 252ను సవరించాలి

**రిపోర్టర్లకు ఒకలా.. డెస్క్ జర్నలిస్టులకు మరోలా కార్డులు సరికాదు**

**అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలి**

**సమాచార శాఖ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్‌కు హెచ్‌యూజే, టీడబ్ల్యూజేఎఫ్ వినతి**



హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీవో 252లో అనేక లోపాలున్నాయని, వెంటనే వాటిని సవరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సోమవారం సమాచార శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అడిషనల్ డైరెక్టర్ జగన్ ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. కొత్తగా అక్రిడిటేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డికి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. అయితే జీవోలో ఉన్న కొన్ని నిబంధనలు జర్నలిస్టులను గందరగోళానికి గురిచేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 252లో జర్నలిస్టులను రెండు వర్గాలుగా విభజిస్తూ పాలసీ నిర్ణయం జరిగిందనీ, ఇది సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. రిపోర్టర్లకు అక్రిడిటేషన్ అని, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డు అని పేర్లు పెట్టి విభజించడం వల్ల డెస్క్ లో పనిచేసేవారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే కేంద్రం తీరుతో రైల్వే పాసులు పోయాయని, ఆర్టీసీ రాయితీ కూడా తగ్గించారని గుర్తు చేశారు. ఇప్పుడు మీడియా కార్డు పేరుతో డెస్క్ జర్నలిస్టులకు బస్ పాస్ సౌకర్యం బంద్ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. డెస్కు జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కొత్త నిబంధనల వల్ల చిన్న, మధ్య తరహా పత్రికలకు అక్రిడిటేషన్లు దక్కకుండా పోతున్నాయని చెప్పారు. గతంతో పోలిస్తే భారీగా కార్డుల సంఖ్యను తగ్గించారని, దీనివల్ల వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాల్సిందేనని హెచ్‌యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. జీవో 252 లోపాలను సవరించి, డెస్క్ జర్నలిస్టులను, చిన్న పత్రికలను ఆదుకోవాలని కోరారు. కాగా, దీనిపై స్పందించిన అడిషనల్ డైరెక్టర్ జగన్ ... మీడియా కార్డులకు, అక్రిడిటేషన్ కార్డులకు ఒకే రకమైన సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. డెస్క్ జర్నలిస్టులకు బస్ పాస్ ఉండదనేది అసత్య ప్రచారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాంచందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, గుడిగ రఘు, హెచ్‌యూజే కార్యదర్శి జగదీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ఉపాధ్యక్షులు దామోదర్, డెస్కు జర్నలిస్టులు ఉపేందర్, మస్తాన్, సురేష్, కిరణ్, నరేష్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి**

జర్నలిస్టులకు పెండింగ్ లో ఉన్న ఇండ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నట్లుగానే జర్నలిస్టులకు కూడా ఆరోగ్య విధానాన్ని (హెల్త్ స్కీమ్) అమలు చేయాలన్నారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## డీఎస్పీ సహా ముగ్గురు పోలీసులు సస్పెండ్

**వరంగల్‌లో తప్పుడు కేసుల వ్యవహారంపై డీజీపీ సీరియస్**

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): వరంగల్‌లో తప్పుడు కేసులు బనాయించి అమాయకులను వేధించిన ఆరోపణలపై ముగ్గురు పోలీస్ అధికారులపై తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెండైన వారిలో అప్పటి ఏసీపీ (ప్రస్తుత డీఎస్పీ), ఓ ఇన్‌స్పెక్టర్, ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఈ వ్యవహారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, గతంలో వరంగల్ ఏసీపీగా పనిచేసి ప్రస్తుతం ములుగు సైబర్ క్రైమ్ డీఎస్పీగా ఉన్న నందిరామ్ నాయక్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఇన్‌స్పెక్టర్ టి. గోపిరెడ్డి, పరకాల పోలీస్ స్టేషన్ ఎస్సై విఠల్‌ను సస్పెండ్ చేస్తూ డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది వ్యక్తిగత కక్షతో ఓ ఇంటిపై దాడి, దోపిడీ జరిగిందంటూ ఓ వ్యక్తిపై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే, ఆ కేసులో తనను అన్యాయంగా ఇరికించారని, ఘటన జరిగిన సమయంలో తాను అక్కడ లేనని బాధితుడు ఆధారాలతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో హైకోర్టు ఆదేశాల మేరకు వరంగల్ కమిషనరేట్ పోలీసులు ఓ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో దీనిపై విచారణ చేపట్టారు. ఈ విచారణలో మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో సుమారు 10 నుంచి 15 వరకు తప్పుడు కేసులు నమోదు చేసి, పలువురిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసినట్లు తేలింది. విచారణ అధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా డీజీపీ శివధర్ రెడ్డి ఈ ముగ్గురు అధికారులపై కఠిన చర్యలు తీసుకున్నారు.

## కేసీఆర్ అసెంబ్లీకి రారేం?: భట్టి

ఖమ్మం, డిసెంబర్ 23 (ఈవార్తలు): రెండేళ్లుగా అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని భట్టివిక్రమార్క తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తోలు తీస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారని, తాము వారిలా మాట్లాడలేమని పేర్కొన్నారు. అలా మాట్లాడే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు.

## దక్షిణాది 'లిక్కర్ క్యాపిటల్'గా తెలంగాణ

ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ.11,351 మద్యం ఖర్చు

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): దక్షిణాది రాష్ట్రాల్లో మద్యం వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచి 'లిక్కర్ క్యాపిటల్'గా మారింది. దేశ సగటుతో పోలిస్తే ఇక్కడ తలసరి మద్యం వినియోగం ఎక్కువగా ఉండటం గమనార్హం. ఏడాదికి సగటు తలసరి ఆల్కహాల్ వినియోగం 4.44 లీటర్లుగా ఉండగా, కర్ణాటక (4.25 లీటర్లు), తమిళనాడు (3.38 లీటర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏపీ 2.71 లీటర్లతో నాలుగో స్థానంలో ఉండగా, కేరళ 2.53 లీటర్లతో చివర్లో నిలిచింది. తెలంగాణలో ముఖ్యంగా బీరు వినియోగం గత ఏడాది కాలంలో అనూహ్యంగా పెరిగింది. వేసవికే పరిమితం కాకుండా ఏడాది పొడవునా బీరు వినియోగం సాగుతోంది. ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ.11,351 మద్యం కొనుగోలుకు ఖర్చు చేస్తున్నారు. ఇది దేశంలోనే అత్యధికం. అదే సమయంలో ఏపీలో సగటు వ్యక్తి ఏడాదికి రూ.6,399 మాత్రమే ఖర్చు చేస్తున్నాడు. ఈ భారీ మద్యం విక్రయాల వల్ల తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ.36,000 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. అయితే, ఈ ఆదాయం వెనుక సామాజిక, ఆరోగ్య సమస్యలు దాగి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఫ్యాన్స్‌పై ఫిర్యాదు చేయను: నిధి అగర్వాల్

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): లులు మాల్ వ్యవహారంలో తన పట్ల అభిమానులు వ్యవహరించిన తీరుపై ఫిర్యాదు చేసేందుకు సినీ నటి నిధి అగర్వాల్ నిరాకరించారు. 'రాజా సాబ్' చిత్రం పాట విడుదల సందర్భంగా ఆమె లులు మాల్‌కు విచ్చేశారు. కార్యక్రమం అనంతరం ఆమె తిరిగి వెళుతుండగా, అభిమానులు ఆమె చుట్టూ గుమిగూడారు. సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో నిధి అగర్వాల్‌కు అభిమానుల నుంచి కొంత అసభ్యకర ప్రవర్తన ఎదురైంది. ఈ వ్యవహారంపై పోలీసులు ఇప్పటికే లులు మాల్‌తో పాటు శ్రేయాస్ మీడియాపై కేసు నమోదు చేశారు. అభిమానులు వ్యవహరించిన తీరుపై పోలీసులు నిధి అగర్వాల్‌ను సంప్రదించారు. అసౌకర్యానికి గురి చేసిన అభిమానులపై ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు సూచించారు. అయితే, ఈ అంశంపై తాను ఎవరిపైనా ఫిర్యాదు చేయదలుచుకోలేదని నిధి అగర్వాల్ స్పష్టం చేశారు. అయితే, సంఘటన జరిగిన ప్రాంతంలో సరైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల తాను ఇబ్బందికి గురైన మాట వాస్తవమని ఆమె పోలీసులకు తెలియజేసినట్లు సమాచారం. కాగా, నిధి అగర్వాల్ పట్ల సుమారు పదహారు మంది అనుచితంగా ప్రవర్తించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇటీవల ప్రభాస్ 'రాజా సాబ్' చిత్రం నుంచి రెండవ పాట విడుదల కార్యక్రమం కేపీహెచ్‌బీలోని లులు మాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి నిధి అగర్వాల్‌తో సహా చిత్ర యూనిట్ హాజరైంది. ఈవెంట్ అనంతరం నిధి అగర్వాల్ బయటకు వెళుతుండగా ఒక్కసారిగా అభిమానులు ఆమెను చుట్టుముట్టారు. ఆమెతో సెల్ఫీ దిగేందుకు పోటీ పడ్డారు. ఆమె అతికష్టమ్మీద వారి నుంచి బయటపడి అక్కడి నుంచి నిష్క్రమించారు.

# ఇన్వెస్ట్‌మెంట్స్ లింకులతో జాగ్రత్త


**ప్రజలకు పోలీసుల అలర్ట్**



హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): టెలిగ్రామ్, వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా గ్రూపుల ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ సూచనల లింకులు వస్తే అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ పేరుతో భారీ ఎత్తున మోసాలు జరుగుతున్నాయని... క్రిప్టో కరెన్సీ, ఫారెక్స్, స్టాక్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు లేదా గ్యారెంటీ లాభాల పేరు చెప్పి సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసగిస్తున్నారని తెలిపారు. బాధితులను ఆకర్షించి, వెబ్‌సైట్లు, ట్రేడింగ్ డాష్‌బోర్డులు, యాప్స్ ద్వారా నకిలీ లాభాలు చూపిస్తూ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ప్రలోభపెడుతున్నారని పోలీసులు వివరించారు. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ సైబర్ క్రైమ్ యూనిట్ హెచ్చరికలు జారీ చేసింది. వాట్సాప్ ఆధారిత పెట్టుబడి మోసానికి గురైన మాజీ పోలీసు అధికారి ఒకరు రూ.8.10 కోట్లు పోగొట్టుకున్నారు. పంజాబ్ కేడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి, రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అమర్ సింగ్ చాహల్ వాట్సాప్ ఆధారిత పెట్టుబడి మోసానికి గురై రూ.8 కోట్లకు పైగా నష్టపోయారని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఆయన రెండు నెలల పాటు మోసగాళ్ల వలలో చిక్కుకుపోయారని, తన వద్ద డబ్బులు లేకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద రూ.7.5 కోట్ల మేర అప్పు తీసుకున్నారని, ఆ తర్వాత ఆర్థిక, మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడ్డారని వెల్లడించారు. సైబర్ మోసాల వల్ల ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ఈ ఉదంతం తెలియజేస్తోందని పేర్కొన్నారు. నిర్ధారించబడని పెట్టుబడి వేదికలకు, ఆన్‌లైన్‌లో లాభాలను చూపించే ప్రకటనలకు దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా పెట్టుబడి సలహాదారుగా పేర్కొంటూ సందేశం వస్తుంది. మొదట నమ్మకం కలిగించడానికి లాభాలు వచ్చే పెట్టుబడి అవకాశాలను పరిచయం చేస్తారు. ప్రారంభంలో తక్కువ పెట్టుబడి పెట్టాలని సూచిస్తారు. నిత్యం లాభాలను చూపిస్తూ నిజమైన ట్రేడింగ్ జరుగుతున్నట్లు భ్రమ కలిగిస్తారు. మోసపూరితంగా రూపొందించిన వేదికలో నకిలీ లాభాలను చూపించి, అవే నిజమైన లాభాలుగా చెబుతారు. డబ్బులను ఉపసంహరించుకుంటానని బాధితుడు చెప్పగానే పన్నులు, కరెన్సీ కన్వర్షన్, ఉపసంహరణ ఛార్జీలు, కంప్లయెన్స్ ఛార్జీల పేరుతో చెల్లింపులు చేయాలని అడుగుతారు. చెల్లింపులు జరిపిన ప్రతిసారి కొత్త కారణం చెప్పి మరిన్ని డబ్బులు వసూలు చేస్తారు. బాధితుడికి అనుమానం వచ్చినట్లు గ్రహిస్తే, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లేదా వాలెట్ ఫ్రీజ్ అవుతుందని భయపెడతారు. సైబర్ మోసమని గ్రహించే వరకు బాధితుడు డబ్బులు చెల్లిస్తూనే ఉంటాడు. సోషల్ మీడియా ద్వారా వచ్చే లింకులు, ఆఫర్లను విశ్వసించవద్దు. ఎవరైనా సలహాదారులు ఉంటే, వారు సెబి వద్ద రిజిస్ట్రేషన్, లైసెన్స్ కలిగి ఉన్నారో లేదో చూసుకోవాలి. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని చెబితే నమ్మవద్దు. సైబర్ నేరగాళ్లు మాత్రమే పన్నులు, ఫీజులు అంటూ వసూలు చేస్తారు. నిజమైన ట్రేడింగ్ వేదికలు ఎప్పుడూ అలా అడగవు. అనుమానాస్పద కార్యకలాపాలు దృష్టికి వస్తే 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ లేదా సైబర్ క్రైమ్ వెబ్ సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు సూచించారు.

# అఖండ-2 ప్రతీ ఒక్కరు చూడాలి

**చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్**



హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): హైదరాబాదులోని ప్రఖ్యాత చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన పూజారి రంగరాజన్ తాజాగా అఖండ-2 చిత్రాన్ని వీక్షించారు. సినిమా చూసిన అనంతరం థియేటర్ వద్ద మీడియాతో మాట్లాడారు. ధర్మం గురించి ఈ సినిమాలో అద్భుతంగా చూపించారని, ప్రతి ఒక్కరూ వీక్షించాలని పిలుపునిచ్చారు. లాజిక్, మ్యాజిక్ రెండూ ఉన్న చిత్రం ఇదని అన్నారు. "ఇవాళ బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ నటించిన అఖండ-2 చిత్రాన్ని వీక్షించాను. సీట్లోంచి కదలకుండా ఆ సినిమా చూశాను. భగవంతుడు ఉన్నాడా, ఉంటే ఇంత అరాచకాన్ని సహిస్తూ ఉంటాడా అనేది ప్రతి ఒక్క మనిషిలో ఉండే ప్రశ్న. ప్రపంచంలో మిగతా చోట్ల అర్థ, కామం కోసమే జీవిస్తారు... మన దేశంలో మాత్రం ధర్మ, అర్థ, కామ, మోక్షాల కోసం జీవిస్తాం.. వీటిని చతుర్విధ పురుషార్థాలు అంటారు. మన గడ్డపై ధర్మమే ముఖ్య భూమిక పోషిస్తూ ఉంటుంది. ధర్మం ఎప్పుడు ఇబ్బందుల్లో ఉంటుందో, అప్పుడు ఏదో ఒక రూపంలో భగవంతుడు వస్తాడు, తన ధర్మాన్ని రక్షించుకుంటాడు అనే ఇతివృత్తం అఖండ-2 చిత్రంలో చూపించారు. ఆలయం అనేది భక్తులకు చెందిన సన్నిధి అనే మా నాన్న గారి మాటలు ఈ సినిమా చూశాక గుర్తుకొచ్చాయి. ఇందులో బాలయ్య డైలాగులు మా నాన్న గారి మాటలను జ్ఞప్తికి తెచ్చాయి. ఆ డైలాగ్ రైటర్ ను అభినందించాలి. భగవంతుడ్ని కూడా కమర్షియల్‌గా చూస్తున్న రోజుల్లో భగవంతుడు ఎందుకు వస్తాడు అనే కోణం కూడా ఉంది. చెప్పుకుంటూ పోతే గంటసేపు రివ్యూ ఇవ్వవచ్చు. గట్టిగా ఐదు నిమిషాలు కూడా కూర్చుని రాయలేని పనికిమాలిన వాళ్లు ఇచ్చే రివ్యూలు పట్టించుకోనవసరంలేదు. ఈ సినిమా ఎలా ఉంటుందనేది ఎవరో ఎందుకు చెప్పాలి... మీరు చూసి మీరే మీ సొంత రివ్యూ ఇవ్వండి. ఇదే నా విన్నపం. నేను ఈ సినిమాను స్వయంగా వీక్షించాను. ఇందులో లాజిక్ ఉందా, మ్యాజిక్ ఉందా అనేది మీరే చూసి తెలుసుకోండి. ఎవరో చెప్పింది నమ్మవద్దు. ప్రతి ఫ్రేములో లాజిక్ ఉంది, మ్యాజిక్ ఉంది. ధర్మాన్ని రక్షించే ఒక సైన్యం కావాలి. కాబట్టి చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఈ సినిమా చూడండి. ఇది వినోదాత్మక చిత్రం కాదు... ధర్మం పట్ల మనలోని భావాలను మరింత పెంపొందించే చిత్రం ఇది. ప్రతి కుటుంబం వచ్చి ఈ సినిమా చూడాలని ప్రార్థిస్తున్నాను" అంటూ రంగరాజన్ తన అభిప్రాయాలను వెల్లడించారు.

## లొంగిపోయిన 22 మంది నక్సల్స్

**వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు**

**మావోయిస్టులపై రూ.2.18 కోట్ల రివార్డు**

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన మవోయిస్టులు పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీటిలో ఒక ఏకే-47, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.18 కోట్ల రివార్డు ఉంది. తాజా లొంగుబాటు ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బ అని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్లలో పలువురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతం కాగా, పెద్ద సంఖ్యలో మావోలు పోలీసుల ముందు లొంగిపోతున్నారు.

## దొంగచాటు జీవోలు బయటపెట్టు

**హైకోర్టు ఆదేశాలు సర్కారుకు చెంపపెట్టు**

**82 శాతం జీవోలు రహస్యమే: హరీశ్ రావు**



హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) ప్రజలకు అందుబాటులో ఉంచకుండా దాచిపెడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాల్లోగా బహిర్గతం చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు... ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కార్‌కు చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. ఈ విషయంపై హరీశ్ రావు స్పందిస్తూ.. "ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, జీవోలను దాచిపెడుతూ పెద్ద డ్రామా ఆడుతోంది. మా పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారంతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీంతో ప్రభుత్వ అసలు రంగు బయటపడబోతోంది" అని తెలిపారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 26 వరకు మొత్తం 13 నెలల కాలంలో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేయగా, వాటిలో కేవలం 3,290 మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో పెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. "ఏకంగా 15,774 జీవోలను, అంటే 82 శాతం జీవోలను ఎందుకు దాచిపెడుతున్నారు? చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నారు? రేవంత్ రెడ్డి, ఇదేనా మీరు చెప్పిన ప్రజా ప్రభుత్వం?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తక్షణమే జీవోలన్నింటినీ బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


## నటుడు శివాజీకి మహిళా కమిషన్ నోటీసులు

**హీరోయిన్ల డ్రెస్సింగ్ పై వివాదాస్పద వ్యాఖ్యలు**

**కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన చైర్‌పర్సన్**

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఈవార్తలు): ప్రముఖ నటుడు శివాజీ మహిళల వస్త్రధారణపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన తెలంగాణ మహిళా కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన 'దండోరా' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ ఈ వ్యాఖ్యలు చేశారు. "చీర కట్టుకుంటేనే అందం కానీ, సామాన్లు కనబడేలా బట్టలు వేసుకోవడం కాదు. అలాంటి వాళ్లను చూస్తే దరిద్రపు .. అని తిట్టాలనిపిస్తుంది... పైకి ఎవరూ అనకపోయినా లోపల మాత్రం తిట్టుకుంటారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మాటలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద స్పందించారు. శివాజీ వ్యాఖ్యలను తమ లీగల్ టీమ్ పరిశీలించిందని, ఆయనపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. సినిమా వేడుకల్లో మాట్లాడేటప్పుడు నటులు జాగ్రత్తగా ఉండాలని, మహిళలను అవమానించేలా మాట్లాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శివాజీ వ్యాఖ్యలపై గాయని చిన్మయి శ్రీపాద సహా పలువురు సెలబ్రిటీలు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళల దుస్తుల ఎంపికపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వారి స్వేచ్ఛను హరించడమేనని, ఇది తిరోగమన ధోరణిని సూచిస్తుందని విమర్శిస్తున్నారు.

## సోషల్ వాణి



### డెస్క్ జర్నలిస్టుల కన్నీటి గర్జన

కలాలు కదలకున్నా, పెద్ద సార్లు కన్నులు కనిపెట్టకున్నా,
డెస్క్‌లో దాగిన దీపాలం మనమే!
రాత్రులు గడుపుతున్నాం స్క్రీన్‌ల నీలి వెలుగులో..
కీబోర్డు మోగిస్తూ.. బాధలను మోస్తున్నాం..
ప్రతి అక్షరంలో మన రక్తం కారుతోంది,
ప్రతి వాక్యంలో మన గుండెలు పగిలిపోతున్నాయి!
సోదరులారా... మనల్ని చీల్చాలని విషపు వలలు చూస్తున్నాయి
"నువ్వు డెస్క్" అని, "నువ్వు ఫీల్డ్" అని గోడలు కట్టబోతున్నారు
మన సోదరులు రోడ్డుపై నిలబడి చెమట కారుస్తుంటే,
మనం డెస్క్‌లో కూర్చుని అదే చెమటను కన్నీళ్ళుగా కారుస్తున్నాం!
అతడి గొంతు గర్జిస్తే... మన కలం గర్జిస్తుంది!
అతడి రక్తం చిమ్మితే... మన అక్షరాలు ఎర్రగా మారతాయి!
ఎవడో ఒకడు మన మధ్య గోడలు కడుతున్నాడు,
కుట్రలతో మనల్ని విడదీయాలని చూస్తున్నాడు!
కానీ... కానీ... మన గుండెల మధ్య గోడ ఎక్కడుంది?
మన ఆత్మల మధ్య విభేదం ఎక్కడుంది?
ఈ రాత్రి... ఈ క్షణం... మనం ఒక్కటవుదాం
మనం ఒక్కటిగా గర్జిస్తే... శత్రువులు వణుకుతారు!
ఐక్యత... ఐక్యత... ఐక్యతే మన సిద్దాంతం
మనం కట్టుకట్టాల్సిన సమయం వచ్చింది సోదరులారా,
మన ఐక్యత జ్వాలతో ఆ కుట్రల్ని దహించి వేద్దాం
ఒకే ఆవేదన, ఒకే ఆకాంక్ష %-% ఐక్యతే మన శ్వాస!
మన హక్కులు మన చేతుల్లోనే ఉన్నాయి!
కుట్రలు దహించే అగ్ని ఐక్యత
మన గుండెల్లోంచి పుడితే.. %-% ఎవరూ ఆర్పలేరు!
మన ఆవేదనను ఆయుధంగా మార్చుకుందాం,
మన హక్కుల కోసం మనం మళ్ళీ పుడుతున్నాం!

- మోదెం రాజేశ్

# పర్యాటకుల భద్రతకు ప్రొటెక్షన్ పాలసీ

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి**



అమరావతి, డిసెంబర్ 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు 100 శాతం భద్రతకు భరోసా ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా సురక్షితమన్న భావన పర్యాటకుల్లో కలిగేలా చూడాలని అన్నారు. అందుకోసం టూరిజం సేఫ్టీ అండ్ ప్రొటెక్షన్ పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి వచ్చే పర్యాటకులు సంతోషంగా తిరిగి వెళ్లాలని, ముఖ్యంగా కుటుంబ సభ్యులందరూ తరలి వచ్చినప్పుడు వారికి భద్రమైన పరిస్థితులు కల్పించాలని, మహిళా పర్యాటకుల భద్రతకు ప్రత్యేక విధానం తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి, ఉపాధి కల్పనపై పర్యాటక, దేవాదాయ, ఆర్ అండ్ బి శాఖల మంత్రులు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రత్యక్షంగా పాల్గొనగా, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత, గిరిజన ప్రాంతాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు పర్యాటక శాఖలో అద్భుత అవకాశాలు ఉన్నాయన్నారు. టూరిజం హాట్ స్పాట్లను గుర్తించడం, అక్కడ సౌకర్యాలు మెరుగుపర్చడం ద్వారా దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించవచ్చని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో హెలీపోర్టులు ఏర్పాటు చేయవచ్చని, అందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. నిర్ణీత సమయంలో వాటిని అమలు చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తాను చాలా సందర్భాల్లో టూరిజం పాలసీపై చర్చించామని వివరించారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా భద్రతకు ఇబ్బంది ఉండదన్న భావన టూరిస్టుల్లో కల్పించాలన్నారు. ప్రకృతిని ఇష్టపడుతూ అటవీ ప్రాంతాల్లో పర్యటించేవారికి తగిన భద్రత అందించాలని ఆదేశించారు. పర్యాటక ప్రదేశాల్లో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎకో టూరిజం అభివృద్ధి చేస్తున్న ప్రాంతాల్లో మన సంస్కృతి, సామాజిక పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పర్యాటకులతో ఎలా మసలుకోవాలో అనే అంశంపై ఒక ప్రవర్తనా నియమావళి తీసుకువచ్చి, దాన్ని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఉల్లంఘనలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, ముఖ్యంగా హోటల్స్ నిర్వాహకులు, ట్రావెల్స్ నిర్వాహకులు ఈ నియమావళి కచ్చితంగా పాటించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రకృతి సంపదను వారసత్వ సంపదగా గుర్తించాలని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల్లో బోట్ రేసులు వంటి వాటిని నిర్వహించడం ద్వారా ఆకర్షించాలని, మంగళగిరి, కొండపల్లి, సిద్ధవటం తదితర కొండ ప్రాంతాల్లో పర్వతారోహణకు అనువైన పరిస్థితులు కల్పించాలన్నారు. మరిన్ని శాఖలను కూడా భాగస్వాముల్ని చేయాలని సూచించారు. తదుపరి సమావేశం జనవరి 6వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఉన్నతాధికారులు అజయ్ జైన్, అమ్రపాలి కాట, శాంతిప్రియ పాండే, రాహుల్ పాండే, శరవణన్, రామచంద్ర మోహన్, శ్రీనివాస్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కృష్ణబాబు, కాంతిలాల్ దండే, హరి జవహర్ లాల్ పాల్గొన్నారు.



## సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా కనకమేడల

**కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ నేతకు కీలక పదవి**

న్యూఢిల్లీ: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా (ఏఎస్‌జీ) ఆయన్ను నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ నియామకంతో కనకమేడల సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కీలక కేసుల్లో వాదనలు వినిపిస్తారు. అదనపు సొలిసిటర్ జనరల్ పదవి కేంద్ర ప్రభుత్వ న్యాయవ్యవస్థలో అత్యంత ముఖ్యమైనది. అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు సహాయకుడిగా వ్యవహరిస్తూ, సుప్రీంకోర్టు, హైకోర్టులలో ప్రభుత్వం తరఫున వాదించాల్సి ఉంటుంది. కనకమేడల రవీంద్ర కుమార్‌కు న్యాయ, రాజకీయ రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన సీనియర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టు, హైకోర్టులలో పలు కీలక కేసులను వాదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున కూడా గతంలో వాదనలు వినిపించారు. రాజ్యాంగం, పరిపాలన అంశాలపై ఆయనకు మంచి పట్టు ఉంది. 2018 నుంచి 2024 వరకు టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి, పార్లమెంటులో చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ లీగల్ సెల్‌లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో, ఆ పార్టీకి చెందిన నేతకు ఇంతటి ముఖ్యమైన న్యాయ పదవి దక్కడం రాజకీయంగా కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. దీనివల్ల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కేసుల్లో బలమైన న్యాయ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

# ఏపీలో క్వాంటం కోర్సులు

**ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం ప్రతినిధులతో చంద్రబాబు భేటీ**



అమరావతి, డిసెంబర్ 23 (ఈవార్తలు): ఏపీ యువతకు భవిష్యత్ సాంకేతికతలో నైపుణ్యాలు అందించేందుకు క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి కోర్సులను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఇందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించేలా దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు.. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రతిపాదనలను సీఎంకు వివరించారు. వచ్చే ఏడాది నుంచి రెండేళ్ల పాటు నాలుగు దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు తమ యాక్షన్ ప్లాన్‌ను సమర్పించారు. ఈ ప్రతిపాదనలను సమీక్షించిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి క్వాంటం టెక్నాలజీపై అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. "ప్రైవేట్ పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ఆధునిక టెక్నాలజీ అందుబాటులో ఉండాలి. ముఖ్యంగా 7, 8, 9 తరగతుల విద్యార్థులకు క్వాంటం టెక్నాలజీపై అవగాహన కల్పించాలి. ఇందుకోసం అవసరమైన కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి" అని సూచించారు. ఈ లక్ష్య సాధన కోసం ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. 2026 జనవరి నెలాఖరు నాటికి క్వాంటం టెక్నాలజీలో నైపుణ్యాలు అందించేలా పాఠ్యాంశాలను సిద్ధం చేయాలన్నారు. సుమారు 50 వేల మందికి పైగా టెక్ విద్యార్థులకు ఈ నూతన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్' వేదికను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 2026 జనవరి నెలాఖరులో 'స్టూడెంట్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్' నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఈ సదస్సులో విద్యార్థులు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు. ఇదే సమావేశంలో రాష్ట్రంలో ట్రూ 5జీ సేవల విస్తరణపై బీఎస్ఎన్ఎల్ అధికారులతో కూడా సీఎం సమీక్షించారు. ఈ భేటీలో విద్యాశాఖ ఉన్నతాధికారులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంచనా జనాభాతో పన్ను విధించొద్దు

**కడప జిల్లా ఆబ్కారీ ఉత్తర్వులు కొట్టివేత**

**ఆర్ఈటీపై ఏపీ హైకోర్టు కీలక తీర్పు**




అమరావతి, డిసెంబర్ 23 (ఈవార్తలు): రెస్టారెంట్ అండ్ బార్లపై విధించే రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఆర్ఈటీ) విషయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. అధికారిక జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోకుండా, అంచనా వేసిన జనాభా ఆధారంగా ఆర్ఈటీ విధించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఏపీ ఎక్సైజ్ రూల్స్ -2025లోని రూల్ 3(టి) ప్రకారం జనాభా అంటే అధికారికంగా ప్రచురించిన జనాభా లెక్కలేనని న్యాయస్థానం గుర్తు చేసింది. 2011 తర్వాత అధికారిక జనాభా లెక్కలు జరగలేదని, ఆ లెక్కల ప్రకారం మైదుకూరు మున్సిపాలిటీ జనాభా 45,790 మాత్రమేనని పేర్కొంది. 50 వేల లోపు జనాభా ఉన్న మున్సిపాలిటీల్లో ఆర్ఈటీ కింద రూ.35 లక్షలు మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. 2011 నుంచి జనాభా 1.9 శాతం పెరిగి ప్రస్తుతం 56,310కు చేరిందని మైదుకూరు మున్సిపల్ కమిషనర్ చేసిన అంచనాలకు ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వ్యాఖ్యానించింది. కమిషనర్ అంచనా జనాభాను ఆధారంగా తీసుకుని మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఓ బార్‌కు ఆర్ఈటీని రూ.55 లక్షలుగా నిర్ణయిస్తూ కడప జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్ అభ్యర్థనను తీర్పు అందిన ఆరు వారాల్లోపు తిరిగి పరిశీలించాలని ఎక్సైజ్ అధికారులను హైకోర్టు ఆదేశించింది. నిర్ణీత గడువులోపు పునఃపరిశీలన చేయకపోతే మున్సిపాలిటీ జనాభా 50 వేల లోపే ఉన్నట్లు పరిగణించి రూ.35 లక్షల ఆర్ఈటీ మాత్రమే వసూలు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. మైదుకూరు మున్సిపాలిటీ కమిషనర్ అంచనా జనాభా ఆధారంగా విధించిన రూ.55 లక్షల ఆర్ఈటీని సవాల్ చేస్తూ ఓ బార్ యజమాని హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తుది విచారణ అనంతరం హైకోర్టు ఈ కీలక తీర్పును వెలువరించింది.

## వైకుంఠ ద్వార దర్శనాలపై వదంతులు నమ్మొద్దు

**30, 31, జనవరి 1న ఈ-డిప్ టోకెన్లు ఉన్నవారికే దర్శనం**

**జనవరి 2 నుంచి 8 వరకు టోకెన్లు లేనివారికి సర్వదర్శనం**

**టోకెన్లు లేకున్నా తిరుమలకు రావొచ్చని స్పష్టం చేసిన టీటీడీ**



తిరుమల, డిసెంబర్ 23 (ఈవార్తలు): తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను భక్తులు నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. దర్శనాల షెడ్యూల్‌పై ఆయన స్పష్టతనిస్తూ, భక్తులు ఎలాంటి అపోహలకు గురికావొద్దని కోరారు. డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో ఈ-డిప్ టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఆ మూడు రోజుల్లో టోకెన్లు లేని వారికి దర్శనం ఉండదని, అయితే జనవరి 2 నుంచి 8 వరకు సర్వదర్శనం క్యూలైన్ల ద్వారా దర్శించుకోవచ్చని తెలిపారు. టోకెన్లు లేని భక్తులు తిరుమలకు రావొద్దని చెప్పే అధికారం ఎవరికీ లేదని ఆయన తేల్చిచెప్పారు. దర్శనం లేనప్పటికీ, తిరుమల క్షేత్రానికి వచ్చే భక్తులను ఎవరూ అడ్డుకోరని భరోసా ఇచ్చారు. నకిలీ దర్శనం టికెట్ల అమ్మకాల వంటి ఘటనల నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, భక్తుల రద్దీని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు బీఆర్ నాయుడు వివరించారు. మంత్రుల సబ్ కమిటీ పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులందరూ టీటీడీ సూచనలు పాటిస్తూ సంయమనంతో వ్యవహరించి, ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

## చెవిరెడ్డికి చర్మ వ్యాధి.. ఆసుపత్రికి తరలింపు

విజయవాడ, డిసెంబర్ 23 (ఈవార్తలు): ఏపీ లిక్కర్ స్కాం కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. జైల్లో ఉన్న ఆయన పలు ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. కొంత కాలంగా ఆయన చర్మ సంబంధింత వ్యాధితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయాన్ని జైలు అధికారులకు ఆయన తెలియజేశారు. దీంతో, ఈ విషయాన్ని జైలు అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు చెవిరెడ్డిని జైలు సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయనకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మళ్లీ జైలుకు తరలించారు. ప్రస్తుతం చెవిరెడ్డి ఆరోగ్యం బాగుందని అధికారులు వెల్లడించారు. మరోవైపు, గత నెల కూడా వైద్య పరీక్షల నిమిత్తం చెవిరెడ్డిని ఆసుపత్రికి తీసకెళ్లారు. వెరికోస్ వెయిన్స్ తో బాధపడుతున్న ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

## సత్తా ఉన్నవాళ్లు తక్కువగా మాట్లాడతారు

**పీకుడు భాష ప్రజలకు ఉపయోగపడదు: బొత్స**

వైజాగ్, డిసెంబర్ 23 (ఈవార్తలు): మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో పీకుడు డైలాగులు వినిపించవచ్చని, కానీ, ఇలాంటి డైలాగులు ప్రజలకు ఉపయోగపడవని ఆయన అన్నారు. మెడికల్ కాలేజీల పీపీపీలపై మాట్లాడితే చర్యలు ఉంటాయంటూ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఏపీలో మరోసారి వైసీపీ అధికారంలోకి రాదని జోస్యం చెబుతున్నారని విమర్శించారు. పీకుడు భాష డైలాగులకు పనికొస్తాయే కానీ, ప్రజలకు ఎంత మాత్రం ఉపయోగపడదని అన్నారు. చేవ, సత్తా ఉన్నవాళ్లు తక్కువగా మాట్లాడతారని, చేతలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. సంక్రాంతి నాటికి రోడ్లపై గోతులు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని... అయితే, అది ఏ సంవత్సరమో ఆయన చెప్పలేదని బొత్స ఎద్దేవా చేశారు. ఎదుటి వ్యక్తిని తూలనాడటం రాజకీయాల్లో మంచిది కాదని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఫెయిల్ అయిందని అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ మారు వేషాల్లో వెళ్లి పరిశీలిస్తే ప్రజల సమస్యలు వారికి అర్థమవుతాయని చెప్పారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

## కన్నబిడ్డలను కాలువలోకి తోసిన తండ్రి

**ఓ బాలిక మృతి.. మరో బాలిక గల్లంతు.. అనంతపురం జిల్లాలో దారుణం**

అనంతపురం, డిసెంబర్ 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కన్నతండ్రే తన బిడ్డలను కాలువలోకి తోసేశాడు. ఒక బాలిక మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు మరో బాలిక కోసం గాలిస్తున్నారు. ఆదివారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామానికి చెందిన కల్లప్పకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు సింధు, అనసూయ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదు, ఆరు తరగతులు చదువుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం కల్లప్ప తన కుమార్తెలు సింధు, అనసూయలను హెచ్ఎల్‌సీ కాలువ దగ్గరకు తీసుకెళ్లాడు. పెద్ద కుమార్తెను కాలువలోకి తోసేశాడు. ఇది చూసి భయంతో చిన్న కుమార్తె పరిగెత్తింది. అయినా వెంటాడి పట్టుకున్న కల్లప్ప.. ఆమెను కూడా కాలువలోకి తోసేశాడు. కల్లప్ప కుమార్తెలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అతడిని నిలదీశారు. వారిని కాలువలోకి తోసేశానని కల్లప్ప చెప్పాడంతో ఆందోళనకుగురైన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గట్టిగా ప్రశ్నించడంతో కుమార్తెలను కర్ణాటకలోని సిరిగేరి క్రాస్ వద్ద హెచ్ఎల్‌సీ కాలువలోకి తోసేశానని ఓసారి.. గ్రామ సమీపంలోని హెచ్ఎల్‌సీ కాలువలోకి తోసేశానని మరోసారి కల్లప్ప చెప్పి స్పృహ కోల్పోయాడు. దీంతో కల్లప్పను ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. పిల్లల కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపు చర్యల్లో అనసూయ మృతదేహం లభ్యమైంది. సింధు కోసం గాలింపు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, కల్లప్ప ఈ దారుణానికి ఎందుకు పాల్పడ్డాడనే విషయం తెలియరాలేదని, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్లప్ప కోలుకున్న తరువాత అతడిని విచారిస్తామని పోలీసులు తెలిపారు.

# విదేశీ విద్యలో ఏపీ టాప్

**అమెరికాను దాటేసిన కెనడా**

**నీతి ఆయోగ్ నివేదిక**



విజయవాడ, డిసెంబర్ 23 (ఈవార్తలు): ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్తున్న భారత విద్యార్థుల విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. అదే సమయంలో, భారత విద్యార్థులు ఎక్కువగా ఇష్టపడే దేశంగా అమెరికాను అధిగమించి కెనడా మొదటి స్థానానికి చేరింది. ఈ కీలక విషయాలను నీతి ఆయోగ్ "భారత్‌లో ఉన్నత విద్య అంతర్జాతీయాకరణ" పేరుతో విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం, 2016 నుంచి 2020 వరకు విదేశాలకు విద్యార్థులను పంపడంలో ఆంధ్రప్రదేశ్ వరుసగా మొదటి స్థానంలో ఉంది. 2018లో ఏపీ నుంచి రికార్డు స్థాయిలో 62,771 మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లారు. ఏపీ తర్వాత మహారాష్ట్ర, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా భారత విద్యార్థుల ప్రాధాన్యతల్లోనూ స్పష్టమైన మార్పు కనిపించింది. 2016లో అమెరికాలో 4.23 లక్షల మంది భారత విద్యార్థులు ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 3.37 లక్షలకు తగ్గింది. ఇదే సమయంలో కెనడాలో భారత విద్యార్థుల సంఖ్య 94,240 నుంచి ఏకంగా 4.27 లక్షలకు పెరిగింది. ఇది దాదాపు 350 శాతం పెరుగుదల. అటు యునైటెడ్ కింగ్‌డమ్‌కు వెళ్లే విద్యార్థుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. అయితే, ఈ వలసల వల్ల దేశంపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని నీతి ఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది. విదేశీ విద్య కోసం భారతీయులు చేస్తున్న ఖర్చు 2013%-%14లో దాదాపు రూ. 29,000 కోట్లు ఉండగా ఇది 2025 నాటికి 70 బిలియన్ డాలర్లకు (దేశ జీడీపీలో 2 శాతం) చేరుకోవచ్చని అంచనా. ముఖ్యంగా ఇంజినీరింగ్, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్ వంటి స్టీమ్ రంగాల్లోని ప్రతిభావంతులు దేశం విడిచి వెళ్లడం వల్ల పరిశోధన, అభివృద్ధి రంగాలు బలహీనపడుతున్నాయని నివేదిక హెచ్చరించింది. ఈ "బ్రెయిన్ డ్రెయిన్"ను అరికట్టేందుకు జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా "ఇంటర్నేషనలైజేషన్ ఎట్ హోమ్" కార్యక్రమానికి కేంద్రం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా, ప్రపంచ స్థాయి విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు అనుమతించడం, అలాగే ఐఐటీల వంటి భారత విద్యాసంస్థలు విదేశాల్లో క్యాంపస్‌లు తెరిచేలా ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

## నేడు ఇడుపులపాయకు జగన్

కడప, డిసెంబర్ 23 (ఈవార్తలు): వైసీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు రోజుల పాటు తన సొంత నియోజకవర్గం పులివెందులలో పర్యటిస్తున్నారు. మంగళవారం సాయంత్రం బెంగళూరు నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సాయంత్రం 4 గంటలకు పులివెందుల చేరుకున్నారు. అనంతరం, అక్కడ వైసీపీ క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేశారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు పులివెందుల నుండి ఇడుపులపాయకు చేరుకుని ప్రార్థనా మందిరంలో జరిగే క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకు ఇడుపులపాయ నుంచి బయలుదేరి పులివెందులకు చేరుకుని భాకరాపురం క్యాంప్ కార్యాలయంలో జగన్ ప్రజా దర్బార్ నిర్వహిస్తారు. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుని వినతులు స్వీకరిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. గురువారం ఉదయం 8:30 గంటలకు క్రిస్మస్ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో జరిగే వేడుకల్లో పాల్గొననున్నారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 10:20 గంటలకు పులివెందుల భాకరాపురంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. ఉదయం 10:30 గంటలకు హెలీకాప్టర్ లో బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు.

## ముగ్గురు యువకులు దుర్మరణం

**పశ్చిమ గోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం**

**విషాదంగా ముగిసిన క్రిస్మస్ వేడుకలు**

విజయవాడ, డిసెంబర్ 23 (ఈవార్తలు): పశ్చిమ గోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెనుమంట్ర మండలం పోలమూరు సమీపంలో బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సహాయానికి పరుగులు తీశారు. తీవ్ర గాయాలతో పడిపోయిన యువకులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ.. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతులను సత్యనారాయణ, అంజిబాబు, రాజుగా గుర్తించారు. ముగ్గురూ ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. క్రిస్మస్ వేడుకలు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతి వేగంతో వాహనాలు నడపవద్దని, ముఖ్యంగా రాత్రి సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# బంగ్లా.. భయం భయం



## శాంతి భద్రతల వైఫల్యం.. మళ్లీ సైనిక పాలన భయాలు

## పాకిస్థాన్ ఐఎస్ఐ జోక్యంపై ఆరోపణలు



**బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులు మరోసారి సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం దేశంలో శాంతిభద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

**ఈ పరిణామాల నేపథ్యంలో దేశ పరిపాలన మరోసారి సైన్యం చేతుల్లోకి వెళుతుందేమోనన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పెరిగిపోయిన హింసాత్మక ఘటనలు, అరాచక పరిస్థితులు ఈ వాదనలకు మరింత బలం చేకూరుస్తున్నాయి.**

ఢాకా: దేశంలో నెలకొన్న హింసాత్మక పరిస్థితులపై మాజీ మంత్రి అమీర్ ఖుస్రు మహమూద్ చౌదరి వంటి నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యం కాదని, 'మాబోక్రసీ' (మూకల పాలన)గా మారిందని ఆయన ఆరోపించారు. ఇటీవల చట్టోగ్రామ్‌లోని భారత కాన్సులేట్‌పై జరిగిన దాడి ఈ ఆరోపణల తీవ్రతను తెలియజేస్తోంది. మధ్యంతర ప్రభుత్వం విఫలమవడం వల్లే దేశంలో శాంతిభద్రతలు క్షీణించాయని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) సెక్రటరీ జనరల్ మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ ఆరోపించారు. 2026 ఫిబ్రవరిలో జరగనున్న కీలకమైన సార్వత్రిక ఎన్నికలు, దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణకు ముందు భద్రతా వైఫల్యాలు సైనిక జోక్యానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బంగ్లాదేశ్ చరిత్రను పరిశీలిస్తే సైనిక తిరుగుబాట్లు కొత్తేమీ కాదు. 1971లో పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన నాటి నుంచి డజనుకు పైగా తిరుగుబాట్లు, కుట్రలు జరిగాయి. 1975 ఆగస్టులో దేశ జాతిపిత షేక్ ముజిబుర్ రెహ్మాన్‌ను ఆయన కుటుంబంతో సహా సైన్యం దారుణంగా హత్య చేసి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆ తర్వాత దేశం ఏళ్లపాటు అస్థిరతలో మగ్గింది. లెఫ్టినెంట్ జనరల్ జియావుర్ రెహ్మాన్ అధికారంలోకి వచ్చి బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)ని స్థాపించారు. కానీ 1981లో ఆయన కూడా సైనిక అధికారుల చేతిలో హత్యకు గురయ్యారు. అనంతరం 1982లో జనరల్ హుస్సేన్ మహమ్మద్ ఇర్షాద్ రక్తపాతరహిత తిరుగుబాటుతో అధికారాన్ని చేజిక్కించుకుని, 1990 వరకు నియంతలా పాలించారు. ప్రస్తుత పరిస్థితులపై సైనిక తిరుగుబాటు జరగవచ్చంటూ వస్తున్న వార్తలను బంగ్లాదేశ్ సైన్యం ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం ఖండించింది. సైన్యం ఐక్యంగా, రాజ్యాంగబద్ధమైన విధులకు కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. అయితే, ఇటీవల కాలంలో బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్, ముఖ్యంగా దాని గూఢచార సంస్థ ఐఎస్ఐ కార్యకలాపాలు పెరిగాయన్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం ఐఎస్ఐ కమాండర్ ఒకరు ఢాకాలో పర్యటించడం ఈ అనుమానాలకు తావిస్తోంది. బంగ్లాదేశ్‌ను మరింత అస్థిరపరిచేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నించే అవకాశాన్ని తోసిపుచ్చలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య, బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వకార్-ఉజ్-జమాన్ ఇటీవలే భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదికి ఫోన్ చేసి మాట్లాడారు. బంగ్లాదేశ్‌లోని భారత ఆస్తులన్నింటికీ పూర్తి భద్రత కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీ ప్రస్తుతానికి కొంత ఉపశమనం కలిగించినా, యూనస్ ప్రభుత్వం శాంతిభద్రతలను అదుపులోకి తేలేకపోతే సైన్యం జోక్యం అనివార్యమనే భయాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి

## మంగోలియా సరిహద్దులో చైనా 100 క్షిపణులు

### పెంటగాన్ ముసాయిదా నివేదికలో కీలక విషయాలు

బీజింగ్: అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన రేకెత్తించే రీతిలో చైనా తన అణ్వాయుధ సామర్థ్యాన్ని శరవేగంగా విస్తరిస్తోంది. మంగోలియా సరిహద్దుకు సమీపంలో కొత్తగా నిర్మించిన మూడు క్షిపణి క్షేత్రాలలో (సైలో ఫీల్డ్స్) 100కి పైగా ఘన ఇంధన ఆధారిత డీఎఫ్-31 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను చైనా మోహరించినట్లు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ రూపొందించిన ఒక ముసాయిదా నివేదిక వెల్లడించింది. గతంలో ఈ సైలో క్షేత్రాల నిర్మాణం గురించి పెంటగాన్ ప్రస్తావించినప్పటికీ, వాటిలో క్షిపణులను లోడ్ చేశారన్న విషయాన్ని బయటపెట్టడం ఇదే తొలిసారి. పెంటగాన్ నివేదిక ప్రకారం, చైనా తన అణు ఆయుధాగారాన్ని ఇతర అణ్వస్త్ర దేశాల కంటే వేగంగా విస్తరిస్తోంది, ఆధునికీకరిస్తోంది. 2024 నాటికి చైనా వద్ద సుమారు 600 అణు వార్‌హెడ్‌లు ఉండగా, 2030 నాటికి ఆ సంఖ్య 1,000 దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఈ క్షిపణి క్షేత్రాలను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ నిర్వహిస్తోంది. డీఎఫ్-31 క్షిపణులు దాదాపు 11,700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. అణ్వాయుధాల నియంత్రణకు సంబంధించిన చర్చల విషయంలో చైనా ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. "ఈ తరహా చర్యలు లేదా సమగ్ర అణ్వస్త్ర నియంత్రణ చర్చలు జరిపేందుకు బీజింగ్ వైపు నుంచి ఎలాంటి ఆసక్తి కనిపించడం లేదు," అని నివేదికలో పేర్కొన్నారు. 2026 ప్రారంభంలో అమెరికా-రష్యాల మధ్య ఉన్న 'న్యూ స్టార్ట్' అణు ఒప్పందం ముగియనున్న నేపథ్యంలో చైనా విస్తరణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల నవంబర్ 22న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా, రష్యాలతో నిరాయుధీకరణ చర్చలు జరిపే అవకాశం ఉందని సూచించడం గమనార్హం. అయితే, తమ అణ్వాయుధాల విస్తరణపై వస్తున్న ఈ నివేదికలను చైనా మొదటి నుంచి ఖండిస్తోంది. "ఇదంతా చైనాను అప్రతిష్టపాలు చేయడానికి, అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించడానికి చేస్తున్న దుష్ప్రచారమే," అని చైనా అధికారులు గతంలో పలుమార్లు ఆరోపించారు. ప్రస్తుతానికి ఇది ముసాయిదా నివేదిక మాత్రమేనని, అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించే ముందు ఇందులో మార్పులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ తాజా నివేదికపై వ్యాఖ్యానించేందుకు పెంటగాన్, చైనా రాయబార కార్యాలయ అధికారులు వెంటనే నిరాకరించారు.

## అహ్మదాబాద్.. సామాన్యుడి ఇల్లు

**అందుబాటు ధరల్లో ఇళ్ల ధరలు**

**ఆ తర్వాత పుణె, కోల్‌కతా నగరాలు**

**50% దిగువకు ముంబై ఈఎంఐ-ఆదాయ నిష్పత్తి**



న్యూఢిల్లీ: భారతదేశంలోని ప్రధాన నగరాల్లో సొంత ఇల్లు కొనాలనుకునే వారికి 2025 సంవత్సరం గొప్ప ఊరటనిచ్చింది. గృహ కొనుగోలు స్థోమత (హౌసింగ్ అఫర్డబిలిటీ) గణనీయంగా మెరుగుపడినట్లు ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని టాప్-8 నగరాల్లో అహ్మదాబాద్ అత్యంత అందుబాటు నగరంగా మొదటి స్థానంలో నిలవడం విశేషం. ఈ నివేదిక ప్రకారం, ఒక వ్యక్తి తన నెలవారీ ఆదాయంలో ఇంటి ఈఎంఐ కోసం ఎంత శాతం చెల్లించాల్సి వస్తుందనే దాని ఆధారంగా ఈ అఫర్డబిలిటీ ఇండెక్స్‌ను లెక్కిస్తారు. ఈ జాబితాలో, అహ్మదాబాద్‌లో ఈఎంఐ-ఆదాయ నిష్పత్తి కేవలం 18 శాతంగా నమోదైంది. అంటే, సంపాదనలో 18 శాతం మాత్రమే ఈఎంఐకి వెళుతుంది. దీని తర్వాత పుణె, కోల్‌కతా నగరాలు 22 శాతం నిష్పత్తితో రెండో స్థానంలో నిలిచాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో ఈ నిష్పత్తి 47 శాతానికి తగ్గింది. చరిత్రలో ముంబై ఈఎంఐ-ఆదాయ నిష్పత్తి 50 శాతం కంటే దిగువకు రావడం ఇదే తొలిసారి. ఇది గృహ కొనుగోలుదారులకు చాలా సానుకూల పరిణామంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా 50 శాతం కంటే ఎక్కువ నిష్పత్తిని బ్యాంకులు ప్రమాదకరంగా భావిస్తాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును 125 బేసిస్ పాయింట్ల (1.25 శాతం) మేర తగ్గించడమే ఈ మార్పునకు ప్రధాన కారణమని నైట్ ఫ్రాంక్ ఇండియా పేర్కొంది. దీనికి తోడు దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందడం, ద్రవ్యోల్బణం అదుపులోకి రావడం, ప్రజల ఆదాయాలు పెరగడం వంటి అంశాలు కూడా గృహ కొనుగోలు స్థోమత పెరగడానికి దోహదపడ్డాయి. కరోనా సమయంలో కూడా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను దశాబ్దపు కనిష్ఠ స్థాయికి తగ్గించడంతో కొనుగోలు శక్తి పెరిగింది. 2024లో రికార్డు స్థాయిలో జరిగిన అమ్మకాల జోరు 2025లోనూ కొనసాగడానికి ఈ సానుకూల వాతావరణమే కారణం. అయితే, జాతీయ రాజధాని ప్రాంతం (ఢిల్లీ-ఎన్‌సీఆర్)లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ గృహ కొనుగోలు స్థోమత కాస్త క్షీణించింది. ప్రీమియం ఇళ్ల విక్రయాలు భారీగా పెరగడంతో సగటు ఆస్తి ధరలు పెరగడమే దీనికి కారణమని నివేదిక వివరించింది. అయినప్పటికీ, ఎన్‌సీఆర్‌లో కూడా ఈఎంఐ-ఆదాయ నిష్పత్తి 28 శాతంతో సురక్షిత స్థాయిలోనే ఉంది. ఈ సందర్భంగా నైట్ ఫ్రాంక్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజల్ మాట్లాడుతూ, "గృహ కొనుగోలుదారుల డిమాండ్ కొనసాగాలంటే అందుబాటు ధరలు చాలా అవసరం. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా చోదకశక్తిగా పనిచేస్తుంది. గత కొన్నేళ్లుగా ఆస్తి ధరల కంటే ప్రజల ఆదాయాలు వేగంగా పెరిగాయి. దీనికి తోడు వడ్డీ రేట్లు తగ్గడంతో కొనుగోలుదారుల్లో విశ్వాసం పెరిగింది" అని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ 2026లోనూ ఇదే వృద్ధి బాటలో పయనిస్తుందని అంచనాలు ఉండటంతో, రాబోయే ఏడాదిలో కూడా గృహ కొనుగోలుదారులకు సానుకూల వాతావరణం కొనసాగవచ్చని నివేదిక అంచనా వేసింది.

## ప్రియాంక కాబోయే ప్రధాని

### రాబర్ట్ వాద్రా సంచలన వ్యాఖ్యలు.. రాహుల్‌కు అంతసీన్ లేదా?: బీజేపీ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా రాజకీయ భవిష్యత్తుపై ఆమె భర్త, ప్రముఖ పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రియాంకకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందని, దేశ ప్రజలు ఆమెను అత్యున్నత పదవిలో చూడాలనుకునే సమయం వస్తుందని అన్నారు. రాజకీయాల్లో ఆమె ఎదుగుదల అనివార్యమని (తథ్యం) ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చకు దారితీశాయి. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మంగళవారం రాబర్ట్ వాద్రా స్పందించారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల సంరక్షణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇందిరా గాంధీలా ప్రియాంక అయితే కఠిన నిర్ణయాలు తీసుకుంటారని, ఆమె బలమైన ప్రధాని అవుతారని మసూద్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో వాద్రా మాట్లాడుతూ, "ప్రియాంక తన నానమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ, తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్ గాంధీ నుంచి ఎంతో నేర్చుకున్నారని నేను భావిస్తున్నాను. ప్రజలు ఆమెను ఎంతో ఆరాధిస్తారు. ఆమె మాట్లాడినప్పుడు మనసులో నుంచి మాట్లాడతారు. ప్రజలు వినాల్సిన ముఖ్యమైన అంశాలపై ఆమె చర్చించి, వాటిపై గళం విప్పుతారు," అని వివరించారు. "ఆమెకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఈ దేశంలో క్షేత్రస్థాయిలో అవసరమైన మార్పులు తీసుకురాగల సత్తా ఆమెకు ఉందని నేను నమ్ముతున్నాను. ఇది కేవలం ఆమె ఆలోచనలతో కాదు, ప్రజలందరి అంగీకారంతో, వారి ఆకాంక్షలకు అనుగుణంగా మార్పులు తీసుకురావడం ద్వారా సాధ్యమవుతుంది. ఇది కచ్చితంగా కాలక్రమేణా జరుగుతుంది, ఇది అనివార్యం," అని వాద్రా స్పష్టం చేశారు. పార్టీ వరుస ఎన్నికల ఓటముల నేపథ్యంలో ప్రియాంక గాంధీ క్రియాశీలక పాత్ర పోషించాలని కాంగ్రెస్‌లోని కొన్ని వర్గాల నుంచి కొంతకాలంగా డిమాండ్లు వస్తున్నాయి. ఈ క్రమంలో వాద్రా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తనను కూడా రాజకీయాల్లోకి రావాలని డిమాండ్లు వస్తున్నాయని, అయితే ప్రస్తుతం ప్రజల వాస్తవ సమస్యలపైనే దృష్టి పెట్టాలని వాద్రా పేర్కొన్నారు. రాబర్ట్ వాద్రా వ్యాఖ్యలపై బీజేపీ వెంటనే స్పందించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ, "కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌కు రాహుల్ గాంధీపై విశ్వాసం లేదని స్పష్టంగా చెప్పారు. ఆయన స్థానంలో ప్రియాంక గాంధీని తీసుకురావాలని కోరారు. ఇప్పుడు దానికి రాబర్ట్ వాద్రా నుంచి కూడా ఆమోదం లభించింది," అని విమర్శించారు.

## బంగ్లా స్వాతంత్ర్యంలో భారత్ పాత్ర గొప్పది

### రష్యా రాయబారి ఖోజిన్ కీలక వ్యాఖ్యలు

ఢాకా: భారత్ - బంగ్లాదేశ్ ల మధ్య ఇటీవల ఉద్రిక్తతలు పెరిగిన విషయం విదితమే. అంతర్గత అశాంతితో పాటు ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో భారత్ కు బంగ్లాదేశ్ దూరమవుతోంది. భారత్ పట్ల శత్రుభావంతో వ్యవహరిస్తోంది. ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ లోని రష్యా రాయబారి అలెగ్జాండర్ గ్రిగొరివిచ్ ఖోజిన్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశంతో శత్రుత్వం మంచిది కాదంటూ బంగ్లాదేశ్ కు హితవు పలికారు. వైరాన్ని వీడి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని సూచించారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటంలో భారత్ పాత్రను గుర్తు చేసుకోవాలని చెప్పారు. ఢాకాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఖోజిన్ మాట్లాడుతూ.. "భారత్ తో ఉద్రిక్తతలను ఎంత త్వరగా తగ్గించుకుంటే అంత మంచిది. 1971 లో బంగ్లాదేశ్ కు స్వాతంత్ర్యం వచ్చిందంటే కారణం భారతదేశం చేసిన సాయమేననే విషయం మర్చిపోవద్దు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి అవసరమైన సాయం చేసేందుకు రష్యా సిద్ధంగా ఉంది. భారత్, బంగ్లాదేశ్, రష్యా.. మూడు దేశాలు కలిసి పనిచేస్తూ అభివృద్ధి సాధించాలి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించుకోవడం ఆసియా ప్రాంతంలో స్థిరత్వానికి దోహదపడుతుంది" అని వ్యాఖ్యానించారు. అదేసమయంలో భారత్, బంగ్లాదేశ్ ల ద్వైపాక్షిక సంబంధాల్లో రష్యా తలదూర్చాలని అనుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు.

## గెట్ రెడీ ఫర్ వార్

**సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు**

ముంబై: స్వల్పకాలిక, దీర్ఘకాలిక యుద్ధాలకు భారత్ సంసిద్ధంగా ఉండాలని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అణు సామర్థ్యం కలిగిన చైనా, పాకిస్థాన్ నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐఐటీ బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని గుర్తు చేశారు. భారత్‌కు ఇద్దరు ప్రత్యర్థులు ఉన్నారని, ఆ రెండు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉండాలని అన్నారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే కొనసాగుతున్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అయితే వీటిని నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ యుద్ధ తీరును మారుస్తున్నాయని అన్నారు.

## దీపూదాస్‌పై మోసపూరిత అభియోగాలు: షేక్ హసీనా

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపూదాస్ ను అత్యంత పాశవికంగా చంపేసిన ఘటనపై భారత్‌లో తీవ్ర ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనను ఖండిస్తూ ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ కార్యాలయం ముందు వీహెచ్‌పీ, వివిధ హిందూ సంస్థల కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇక ఈ ఘటనపై బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కూడా స్పందించారు. దీపూదాస్‌పై మోసపూరిత అభియోగాలు మోపారని, ఆయన మహమ్మద్ ప్రవక్తను అవమానించాడని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. దీపూదాస్ కుటుంబానికి న్యాయం కల్పిస్తానని హసీనా హామీ ఇచ్చారు. దీపూదాస్ హత్యపై బంగ్లాదేశ్ లోనే కాకుండా ఢిల్లీ నుంచి ఖాట్మండూ వరకు ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. దీపూదాస్ హంతకులను యూనస్ ప్రభుత్వం శిక్షించకుంటే పెద్ద ఉద్యమం చేపడతామని నిరసనకారులు హెచ్చరిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలో షేక్ హసీనా పార్టీ పాల్గొనకుండా యూనస్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయి.

## బ్లూబర్డ్ బ్లాక్-2 కౌంట్‌డౌన్ ప్రారంభం

**మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6**

**నేడు ఉదయం 8.54 గంటలకు నింగిలోకి**

శ్రీహరికోట, డిసెంబర్ 23 (ఈవార్తలు): కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రేపు ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది. ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3-ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

## బిర్యానీ.. తగ్గేదేలే!

**స్విగ్గీలో పదేళ్లుగా నం.1.. ఈ ఏడాది 9.3 కోట్ల బిర్యానీ ఆర్డర్లు**

**నిమిషానికి 194 ఆర్డర్లతో రికార్డు**



న్యూఢిల్లీ: ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తన 2025 వార్షిక నివేదికను విడుదల చేసింది. ఊహించినట్లే, ఈ ఏడాది కూడా భారతీయులు బిర్యానీకే జై కొట్టారు. వరుసగా పదో ఏడాది కూడా దేశంలో అత్యధికంగా ఆర్డర్ చేసిన వంటకంగా బిర్యానీ అగ్రస్థానంలో నిలిచింది. 2025లో స్విగ్గీ ద్వారా ఏకంగా 9.3 కోట్ల బిర్యానీ ఆర్డర్లు డెలివరీ అయినట్లు నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం, ఈ ఏడాది దేశవ్యాప్తంగా నిమిషానికి సగటున 194 బిర్యానీలు, అంటే ప్రతి 3.25 సెకన్లకు ఒక బిర్యానీ ఆర్డర్ నమోదైంది. మొత్తం బిర్యానీ ఆర్డర్లలో చికెన్ బిర్యానీదే సింహభాగం. సుమారు 5.77 కోట్ల ఆర్డర్లతో చికెన్ బిర్యానీ టాప్‌లో ఉంది. బిర్యానీ తర్వాత బర్గర్ (4.42 కోట్లు), పిజ్జా (4.01 కోట్లు) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. భారతదేశంలో ఫుడ్ ట్రెండ్స్ మారినా, బిర్యానీపై ప్రేమ మాత్రం స్థిరంగా ఉందని స్విగ్గీ తన నివేదికలో పేర్కొంది. "బిర్యానీ తిరుగులేని రాజు అని మరోసారి రుజువైంది. ఈ సుగంధభరితమైన వంటకంపై భారతీయుల ప్రేమ ఎప్పటికీ తగ్గదు" అని తెలిపింది. ఈ గణాంకాల వెనుక వినియోగదారుల జ్ఞాపకాలు, సంతోషకరమైన క్షణాలు దాగి ఉన్నాయని స్విగ్గీ మార్కెట్‌ప్లేస్ సీఈఓ రోహిత్ కపూర్ అన్నారు. "ప్రజల సంతోషంలో తాము భాగమైనందుకు గర్వంగా ఉంది" అని ఆయన వివరించారు. ప్రతి ఏడాది స్విగ్గీ 'హౌ ఇండియా స్విగ్గీ'డ్' పేరుతో ఈ నివేదికను విడుదల చేస్తుంది. వినియోగదారుల ఆహారపు అలవాట్లు, దేశవ్యాప్తంగా మారుతున్న ఫుడ్ ట్రెండ్స్‌ను ఈ రిపోర్ట్ విశ్లేషిస్తుంది.

## మిశ్రమంగా మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగగా, ఆర్థిక, ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు నష్టాలను పరిమితం చేసింది. ఫలితంగా, రెండు రోజుల లాభాలకు బ్రేక్ వేస్తూ సెన్సెక్స్ స్వల్పంగా నష్టపోగా, నిఫ్టీ వరుసగా మూడో రోజూ లాభాలను నమోదు చేసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 0.05 శాతం స్వల్పంగా తగ్గి 85,524.84 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 4.75 పాయింట్లు లాభపడి 26,177.15 వద్ద ముగిసింది. నిఫ్టీ వీక్లీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ కారణంగా కూడా ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. సెన్సెక్స్ సూచీలో ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్ షేర్లు ప్రధాన లాభాల్లో నిలిచాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో కోల్ ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్, ఐటీసీ టాప్ గెయినర్లుగా ఉండగా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ నష్టాలను చవిచూశాయి. విస్తృత మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.37 శాతం పెరగ్గా, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 దాదాపు యథాతథంగా ముగిసింది. రంగాలవారీగా చూస్తే, ఐటీ ఇండెక్స్ 0.80 శాతంతో అత్యధికంగా నష్టపోగా, మీడియా ఇండెక్స్ 0.84 శాతంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. టెక్నికల్‌గా నిఫ్టీకి 26,000%-%26,100 స్థాయి కీలక మద్దతు జోన్‌గా ఉందని, ఈ స్థాయి పైన నిలదొక్కుకుంటే మార్కెట్ సానుకూలంగా ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు, ఇయర్-ఎండ్ రీబ్యాలెన్సింగ్ కారణంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ వరుసగా రెండో రోజూ ఫ్లాట్‌గా ముగిసింది.

లవ్లీ చిత్రం


హర్షాలి మల్హోత్రా





# జనవరి 11న నూపుర్ సనోన్ పెళ్లి?

నేనొక్కడినే బ్యూటీ కృతి సనోన్ సోదరి నూపుర్ సనోన్ గురించి పరిచయం అవసరం లేదు. కృతి బాలీవుడ్ లో అగ్ర కథానాయికగా కొనసాగుతుండగానే, నూపుర్ మోడల్ గా నటిగా తనను తాను ఎలివేట్ చేసుకునేందుకు ప్రయత్నించింది. కానీ కృతి రేంజులో నటిగా ఎదగడంలో తడబడింది. ఇటీవల ఈ బ్యూటీ ప్రముఖ గాయకుడు స్టెబిన్ బెన్ తో డేటింగ్ లో ఉందంటూ పుకార్లు షికార్ చేస్తున్నాయి. ఈ జంట పెళ్లికి సంబంధించిన వార్తలు కూడా చక్కర్లు కొడుతున్నాయి. తాజా సమాచారం మేరకు.. ఈ జంట పెళ్లికి సిద్ధమైందని తెలిసింది. జనవరి 11న ఉదయపూర్‌లో వివాహ బంధంతో ఒక్కటి కానున్నారని సమాచారం. ఆ మేరకు జాతీయ మీడియాలు కథనాల్ని ప్రచురించాయి. ప్రీవెడ్డింగ్ వేడుకలు జనవరి 9 నుండి 11 వరకు జరుగుతాయి. జనవరి 11న తాళి కట్టు ముహూర్తం ఫిక్సయింది. మూడు రోజుల పాటు సాగే ఈ వివాహ మహోత్సవం కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగే ఒక ప్రైవేట్ వేడుక అని చెబుతున్నారు.



# నాకు మెంటలెక్కింది: రష్మిక మందన్నా



రౌడీ హీరో విజయ్‌దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ మూవీ రౌడీ జనార్ధన. ఈ సినిమా గ్లింప్స్‌పై రష్మిక సోషల్ మీడియా వేదికగా స్పందించింది. విజయ్‌ని, ఇందులోని స్టఫ్‌ని చూసి తనకు మెంటలెక్కిపోయిందట. యూ రౌడీ ఫెల్లో.. ఇదొక మెంటల్ స్టఫ్. ఏం విజువల్స్.. ఏం మ్యూజిక్..ఏం వైబ్.. ఏం యాక్టింగ్.. విజయ్‌దేవరకొండ, రవికిరణ్ కోలా మీ ఇద్దరు యమ క్రేజీ.. నేను దీన్ని చాలా ప్రేమిస్తున్నాను.. ఇష్టపడుతున్నాను. కీర్తిసురేష్ క్యూటీ నీకు అల్ ద బెస్ట్ అంటూ రష్మిక స్పందించింది. తను రౌడీ జనార్ధన పిక్‌ని జత చేసి రష్మిక షేర్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

# స్వయంభూ పైనే నభా ఆశలు!



నన్ను దోచుకుందువటే చిత్రంతో తెలుగు పరిశ్రమకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు.. నభానటేశ్. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో వెలుగులోకి వచ్చింది. పూరి మేకింగ్ లో అమ్మడు ప్రత్యకంగా హైలైట్ అయింది. నటిగా నభాకు ఓ ఐడెంటిటీ దక్కింది. కానీ ఏం లాభం ఆ సక్సస్ ని మాత్రం కొనసాగించ లేకపోయింది. ఆ తర్వాత నటించిన డిస్కోరాజా , సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రోలాంటి చిత్రాలు డిజాస్టర్లు అయ్యాయి. దీంతో నభా టాలీవుడ్ లో ఏకంగా మూడేళ్ల పాటు కనిపించడం మానేసింది. మళ్లీ 2024 లో డార్లింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా కూడా ఫ్లాప్ అయింది. ఇలా ఇన్నిఫ్లాప్ లు చూసిన బ్యూటీకి తెలుగులో మరో అవకాశం అంటే జరిగే పని కాదని అంతా డిసైడ్ అయ్యారు. కానీ అప్పుడే ఓ పాన్ ఇండియా సినిమాలో ఛాన్స్ అందుకుని సర్ ప్రైజ్ చేసింది. నిఖిల్ హీరోగా స్వయంభూ చిత్రం తెర కెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఓ హీరోయిన్ గా నభా నటేష్ ని దర్శకుడు భరత్ కృష్ణమాచారి ఛాన్స్ ఇచ్చాడు. ఇందులో అమ్మడు ఓ శక్తివంతమైన పాత్రలో నే కనిపించనుంది. హీరోకు ధీటుగా ఆ రోల్ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. సినిమా సక్సస్ మాత్రమే నభా నటేష్ కెరీర్ డిసైడ్ చేసేది. ఇప్పటికే చాలా ఛాన్సులొచ్చాయి. కానీ ఇదే చివరి ఛాన్స్. అదీ ఏడాది గ్యాప్ తర్వాత రిలీజ్ అవుతున్న చిత్రమిది. ఈ సినిమా విజయం సాధిస్తే నభా నటిగా మళ్లీ బిజీ అవుతుంది.

# బన్నీకి చెల్లెలుగా మృణాల్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్- కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో రూపొందుతున్న మూవీలో మృణాల్ యాక్ట్ చేస్తున్నారని వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు కొన్ని నెలల క్రితం టాక్ వినిపించింది. కానీ కొన్ని రోజులుగా ఆ మూవీలో అల్లు అర్జున్ సిస్టర్ గా మృణాల్ ఠాకూర్ యాక్ట్ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దానిపై మూవీ టీమ్ నుంచి ఎవరూ ఎక్కడా లీక్ చేయనప్పటికీ.. వార్తలు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. మంచి స్కోప్ ఉన్న రోల్ కావడంతో ఆమె సినిమాకు ఓకే చెప్పినట్లు ఊహాగానాలు స్ప్రెడ్ అవుతున్నాయి. సినిమాలో బ్రదర్-సిస్టర్ బాండింగ్ నేపథ్యంలో వచ్చే సీన్స్ హత్తుకుంటాయని టాక్ వినిపిస్తోంది. ఆ ట్రాక్ మూవీ హైలైట్స్ లో ఒకటిగా నిలవనుందట. అందుకే స్టార్ హీరోకు చెల్లెలు రోల్ చేయడానికి కూడా మృణాల్ సిద్ధపడినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే అందులో నిజమెంత ఉందో మాత్రం ఎవరికీ తెలియదు. దీనిపై మృణాల్ ఏమైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

# కృతి శెట్టి డీలా



ముంబై బ్యూటీ కృతిశెట్టి కూడా అలాగే డీలా పడినట్లు కనిపిస్తుంది. కృతిశెట్టి టాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ అవుతుందనుకున్నారు. అందం, అభినయం, ఉప్పెనలో బేబమ్మ పెర్ఫార్మెన్స్ చూసి బేషుక్ గా కెరీర్ ఉంటుందనుకున్నారు. కానీ సన్నివేశం అందుకు రివర్స్ లో ఉంది. ఎక్కడ కాలు పెడితే? అక్కడ దురదృష్టం తప్ప అదృష్టంతో రాణించలేకపోతుంది. తెలుగులో వైఫల్యాలు ఎదురైనా చాలా సినిమాలు చేసింది. కానీ సక్సెస్ మాత్రం ఓ గమ్యాన్ని నిర్దేశించలేకపోయింది. దీంతో కోలీవుడ్ లో కూడా అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. అక్కడా అదే పరిస్థితి. తమిళ్ లో ఏకంగా నటించిన సినిమాలే విడుదలకు నోచుకోవడం లేదు. కార్తీ హీరోగా నటించిన వా వాతయార్ లో నటించింది. ఈ సినిమా ఫైనాన్స్ కారణాలుగా వాయిదా పడుతుంది. ఈనెలలోనే రిలీజ్ అవ్వాలి. కానీ రిలీజ్ అయ్యే పరిస్థితి కనిపించలేదు. ఫైనాన్స్ క్లియర్ అయితే గానీ రిలీజ్ కు కోర్టు అనుమతిచ్చే పరిస్థితులు లేవు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాదే ఈ సినిమా రిలీజ్ అయ్యేది. తెలుగులో ఈ చిత్రం అన్నగారు వస్తున్నారు టైటిల్ తో అనువాదమైంది. అలాగే ఏడాది కాలంగా ఎల్ ఐ కె సినిమాది కూడా ఇదే పరిస్థితి.



# విలనిజాన్ని పండించా

**: బిందుమాధవి**

తెలంగాణ గ్రామీణ జీవన శైలి, సామాజిక ఇతివృత్తంపై అరుదైన చిత్రం దండోరా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. మురళీకాంత్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని రవీంద్ర బెనర్జీ ముప్పానే నిర్మించారు. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందుమాధవి, మౌనికా రెడ్డి తదితరులు నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా నైజాం ఏరియాలో సినిమా విడుదల అవుతుంది. తాజాగా ప్రీరిలీజ్ వేడుకలో నటి బిందుమాధవి మాట్లాడుతూ.. ఈ సినిమాలో నటీనటుల ప్రదర్శన అద్భుతంగా కుదిరింది. వారితో కలిసి సెట్లో సరదాగా గడిచిపోయింది. అలాగే ఈ సినిమా పాటలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మార్క్ కే రాబిన్ పాటలు వింటుంటే, నిజంగా నాలో దాగి ఉన్న విప్లవాన్ని బయటకు తీస్తున్నారనిపించింది. పాటలు అంత బాగా నచ్చాయి అని అన్నారు.

ఈవార్తలు
క్రీడావాణి SPORTS
బుధవారం 24-12-2025
www.evarthalu.com





# చూద్దాం రో-కో షో

## నేటి నుంచి విజయ్ హజారే ట్రోఫీ
## 15 ఏళ్ల తర్వాత దిగ్గజాల ఎంట్రీ

ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీకి రంగం సిద్ధమైంది. బుధవారం నుంచి ఈ టోర్నీకి తెరలేవనుంది. 15 ఏళ్ల సుదీర్ఘ సమయం తర్వాత భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఈ టోర్నీ బరిలోకి దిగుతున్నారు. న్యూఢిల్లీ తరఫున విరాట్ కోహ్లీ, ముంబై తరఫున రోహిత్ ఆడనున్నారు. ఇప్పటికే ఈ ఇద్దరు ఆటగాళ్లు ఆయా జట్లతో కలిసి సన్నాహకాలు మొదలుపెట్టారు. ఈ ఇద్దరూ తమ జట్ల తరఫున తొలి రెండు మ్యాచ్‌లు ఆడనున్నారు. కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు రిషభ్ పంత్ (ఢిల్లీ కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్ (పంజాబ్), మహమ్మద్ షమీ (బెంగాల్), హార్దిక్ పాండ్యా (బరోడా) వంటి స్టార్ ఆటగాళ్లు కూడా తమ రాష్ట్ర జట్ల తరఫున బరిలోకి దిగుతున్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని సమయంలో సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ తెచ్చిన కొత్త నిబంధన కారణంగా భారత ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. దాంతో ఈ టోర్నీకి క్రేజ్ నెలకొంది. డిసెంబర్ 24 నుంచి జనవరి 18 వరకు ఈ టోర్నీ జరగనుంది. జనవరి 12 నుంచి నాకౌట్ మ్యాచ్‌లు జరగనుండగా.. జనవరి 18న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మొత్తం 38 జట్లు బరిలోకి దిగుతున్నాయి. బెంగళూరు వేదికగా ఆంధ్ర జట్టుతో ఢిల్లీ తొలి మ్యాచ్ ఆడనుంది. ఆంధ్ర జట్టుకు ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే ఈ మ్యాచ్‌కు ప్రేక్షకుల అనుమతి లేదు. విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్‌తో పాటు జియో హాట్ స్టార్ వేదికగా ప్రసారం కానున్నాయి. లీగ్ దశలో అన్ని మ్యాచ్‌లకు ప్రత్యక్ష ప్రసారం లేదు. కేవలం అహ్మదాబాద్, రాజ్‌కోట్ వేదికగా జరిగే మ్యాచ్‌లు మాత్రమే ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.

# టాయిలెట్ పక్కన రెజ్లర్ల జర్నీ



కుస్తీ పోటీల్లో భావితారలుగా ఎదుగుతున్న కుర్రాళ్లకు ఘోర అవమానం జరిగింది. పతకాలతో దేశ, రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడించే యువ రెజ్లర్లకు కనీస మర్యాద కూడా దక్కలేదు. అసలేం జరిగిందంటే.. స్కూల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఒడిశాకు చెందిన రెజ్లర్లు ఉత్తరప్రదేశ్ రైలు ఎక్కారు. అయితే.. వారంతా టాయిలెట్ల దగ్గరే కూర్చొని.. చలికి వణుకుతూ ప్రయాణించాల్సి వచ్చింది. వారి ఇబ్బందిని కూర్చున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దాంతో.. విద్యా శాఖ మంత్రి నిత్యానంద గోండ్ విచారణకు ఆదేశించారు. యువ రెజ్లర్లకు టికెట్ బుక్ చేసి పంపాల్సింది పోయి.. వారిని చల్లని చలికి వణుకుతూ ప్రయాణించేలా చేశారు. అమ్మాయిలు, అబ్బాయిలతో కూడిన 18 మంది యువ రెజ్లర్ల బృందం టాయిలెట్ కంపును భరిస్తూనే జర్నీ చేశారు. రెజ్లర్ల దుస్థితిని కళ్లకు కట్టిన ఈ వీడియోను కాంగ్రెస్ నాయకురాలు నవజ్యోతి పట్నాయక్ పోస్ట్ చేశారు. ఈ సంఘటనపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒడిశా ప్రభుత్వ తీరుపై దేశవ్యాప్తంగా విమర్శలకు తావిచ్చిన ఈ వైరల్ వీడియోపై మంత్రి మాట్లాడుతూ..' రెజ్లర్లు టాయిలెట్ దగ్గర కూర్చొని ప్రయాణించడంపై విచారణకు ఆదేశించాం. అసలు ఏం జరిగిందో తెలుసుకొని.. అందుకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటాం' అని వెల్లడించారు. ఈ ఏడాది ఒడిశా ప్రభుత్రం క్రీడలకు పెద్దపీట వేస్తామని ప్రకటించింది. మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తామని.. తగిన వసతులు కల్పిస్తామని చెప్పింది. కానీ, ఇవన్నీ ఆచరణలో మాత్రం అగుపించడంలేదు. తాజాగా రెజ్లర్లను టాయిలెట్ల దగ్గర కూర్చొని ప్రయాణించేలా చేయడంతో ఆ ప్రభుత్వం మాటలకే పరిమితమైందనే విషయం స్పష్టమవుతోంది.




# ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు

అంతర్జాతీయ టీ20ల్లో సంచలన రికార్డ్ నమోదైంది. ఇండోనేషియా పేసర్ గేడే ప్రియాంధన ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు పడగొట్టి సరికొత్త చరిత్రను లిఖించాడు. పురుషుల, మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి. ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్ల ఫీట్‌ను పలువురు బౌలర్లు సాధించినప్పటికీ ఐదు వికెట్లు తీయడం మాత్రం ఇదే ఫస్ట్ టైమ్. లసిత్ మలింగా(శ్రీలంక), రషీద్ ఖాన్(అఫ్గానిస్థాన్), జాసన్ హెూల్డర్(వెస్టిండీస్) ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్ల ఫీట్ సాధించారు. కాంబోడియాతో జరిగిన టీ20 సిరీస్‌లో 28 ఏళ్ల గేడే ప్రియాంధన ఈ అరుదైన ఫీట్ సాధించాడు. వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేసిన ప్రియాంధన.. మరుసటి బంతిని డాట్ చేశాడు. ఆ తర్వాత వరుసగా రెండు బంతుల్లో రెండు వికెట్లు పడగొట్టాడు. ప్రియాంధన ధాటికి కాంబోడియా బ్యాటర్లు షా అబ్రార్ హుస్సేన్, నిర్మల్‌జిత్ సింగ్, రతనక్, మోంగ్‌దర సోక్, పెల్ వెన్నక్ పెవిలియన్ చేరారు. కాంబోడియా ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రియాంధన సంచలన ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో ఇండోనేషియా 60 పరుగుల తేడాతో గెలుపొందింది.



# మా దేశంలో స్వేచ్ఛగా తిరగలేను: రషీద్ ఖాన్

తాలిబన్ రాజ్యం నడుస్తున్న అఫ్గనిస్థాన్‌లో ఎక్కడి నుంచి ఏ బాంబ్ మీద పడుతోందో తెలియదు. అందుకే.. తమకు బుల్లెట్ ప్రూఫ్ కార్లే దిక్కు అంటున్నాడు రషీద్ ఖాన్. ఇటీవల ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్‌తో ఒక ఇంటర్వ్యూలో తమ దేశంలోని పరిస్థితుల గురించి సంచలన విషయాలు వెల్లడించాడీ కెప్టెన్. ప్రపంచంలోనే అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడైన రషీద్ ఖాన్ అఫ్గనిస్థాన్‌లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాడు. 'కేపీదస్విచ్' అనే ఇంటర్వ్యూలో పీటర్సన్ మీ దేశంలో క్రికెట్‌కు ఆదరణ ఎక్కువా? అఫ్గనిస్థాన్‌లో మీ జీవితం ఎలా ఉంటుంది? కాబూల్ వీధుల్లో జాలీగా తిరుగుతారా? అని అని పీటర్సన్ అడిగిన ప్రశ్నకు రషీద్ కూల్‌గా బదులిచ్చాడు. 'నో చాన్స్. నేను మా దేశంలో స్వేచ్ఛగా తిరగలేను. మీ అందరిలా సాధారణ కారు ఉపయోగించలేను. బయటకు వెళ్లాల్సి వస్తే కచ్చితంగా బుల్లెట్ ప్రూఫ్ కారు ఉండాల్సిందే. ప్రతిసారి నేను నా ఈ కారులోనే ప్రయాణిస్తాను' అని తెలిపాడు. నన్ను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరుపుతారని కాదు. ఒకవేళ ఎప్పుడైనా ప్రమాదం పొంచి ఉన్న స్థలలో ఉండే అవకాశముంది. అందుకే.. తుపాకీ గుళ్లను తట్టుకునేలా కారును డిజైన్ చేయించుకున్నాను. మీకు ఇది కాస్త వింతగా అనిపించవచ్చు. కానీ, నాలానే మాదేశంలో చాలామంది తమ భద్రతకు బుల్లెట్ ప్రూఫ్ కార్లలో ప్రయాణిస్తుంటారు' అని వివరించాడు రషీద్.



# గవాస్కర్‌కు ఆన్‌లైన్ భద్రత

భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ పోరాటం ఫలించింది. ఆన్‌లైన్‌లో కొందరు తన పేరును, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారని హైకోర్టును ఆశ్రయించిన లెజెండరీ ఆటగాడికి రక్షణ లభించింది. గవాస్కర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా పెట్టిన పోస్టులను వెంటనే తొలగించాలని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. ఇకపై ఈ మాజీ క్రికెటర్ పేరును, ఫొటోలను, వీడియోలను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించడాన్ని సహించబోమని కోర్టు స్పష్టం చేసింది. దాంతో.. కోర్టు నుంచి ఆన్‌లైన్ భద్రత పొందిన మొట్టమొదటి భారత క్రీడాకారుడిగా గవాస్కర్ గుర్తింపు సాధించాడు. నిత్యం క్రీడా విశ్లేషణలతో వార్తల్లో నిలిచే గవాస్కర్ ఈమధ్య టీమిండియా వైఫల్యానికి హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ను నిందిస్తూ తీవ్ర విమర్శలు చేశాడు.




# నం.1 టీ20 బౌలర్‌గా దీప్తి శర్మ

భారత మహిళా క్రికెటర్ దీప్తి శర్మ.. టీ20ల్లో అత్యుత్తమ బౌలర్‌గా నిలిచారు. ర్యాంకింగ్స్‌లో ఆమె ప్రథమ స్థానాన్ని నిలబెట్టుకున్నది. ఆ ఆల్‌రౌండర్ తొలిసారి తన కెరీర్‌లో ఫస్ట్ ర్యాంక్ కొట్టేసింది. శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ దుమ్ము రేపింది. ఈ నేపథ్యంలో ఆమె ర్యాంక్ మరింత మెరుగైంది. ఇక వన్డే బ్యాటర్లలో స్మృతి మంధానా తన నెంబర్ వన్ బ్యాటింగ్ పొజీషన్‌ను చేజార్చుకున్నది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్డ్ తొలి స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ సమయంలో దక్షిణాఫ్రికా కెప్టెన్ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చింది. ఆస్ట్రేలియాకు చెందిన అన్నాబెల్ సుదర్లాండ్.. టీ20 బౌలర్ల జాబితాలో ఆగస్టు నుంచి నెంబర్ వన్ స్థానంలో ఉన్నది. అయితే తాజాగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఓ వికెట్ తీసిన దీప్తి శర్మ తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నది. దీంతో ఆమె టాప్ ర్యాంక్ కొట్టేసింది. 8 వికెట్ల తేడాతో ఇండియా ఆ మ్యాచ్‌లో గెలవగా, దీప్తి శర్మకు అయిదు కీలకమైన పాయింట్లు వచ్చేశాయి. దీంతో ఆ స్టార్ ఆల్‌రౌండర్ ఒక పాయింట్ తేడాతో ఆస్ట్రేలియా బౌలర్ కన్నా ముందు నిలుచుంది. టీ20 బ్యాటర్లలో జెమీమా

# 'చిన్నస్వామి'లో నో క్రికెట్!

విజయ్ హజారే ట్రోఫీకి చెందిన క్రికెట్ మ్యాచ్‌లను బెంగుళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించాల్సి ఉంది. కానీ బుధవారం నుంచి జరగాల్సిన మ్యాచ్ వేదికను అకస్మాత్తుగా మార్చేశారు. చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ నిర్వహించేందుకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘానికి స్థానిక ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. సిటీ పోలీసు కమీషనర్ సీమంత్ కుమార్ సింగ్ మంగళవారం ఆ విషయాన్ని ప్రకటించారు. జూన్‌లో ఆర్సీబీ విక్టరీ పరేడ్ నేపథ్యంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందారని, ఆ ఘటన తర్వాత జస్టిస్ మైఖేల్ డీ కున్హా కొన్ని ప్రతిపాదనలు చేశారని, పోలీసులు కూడా 17 రకాల మార్పులు కోరుతూ ప్రతిపాదన చేశారని, కానీ ఒక్కటి కూడా కర్నాటక క్రికెట్ సంఘం అమలు చేయలేదని, అందుకే మ్యాచ్ నిర్వహణకు పర్మిషన్ ఇవ్వడం లేదని కుమార్ సింగ్ తెలిపారు. చిన్నస్వామి స్టేడియంకు బదులుగా బీసీసీఐకి చెందిన క్రికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ గ్రౌండ్‌లో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా, కర్నాటక ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విజయ్ హజారే మ్యాచ్ వేదికను మార్చేశారు. ఢిల్లీ, ఆంధ్ర మధ్య మ్యాచ్ జరగాల్సి ఉన్నది. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో ఆడేందుకు విరాట్ కోహ్లీ సిద్ధంగా ఉన్నా, ఆయన అభిమానులకు నిరాశే మిగలనున్నది.



ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
బుధవారం 24-12-2025 | www.evarthalu.com

# వినియోగదారుడా.. తస్మాత్ జాగ్రత్త

భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఎందుకంటే ఇదే రోజు 1986లో వినియోగదారుల రక్షణ చట్టం కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లోకి వచ్చింది. ఇది వినియోగదారుల హక్కులను పరిరక్షించి, అక్రమ వ్యాపారాల నుండి రక్షణ కల్పిస్తుంది ముఖ్యంగా ఆన్లైన్ మోసాల నేపథ్యంలో దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది. డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ కామర్స్ కోసం 2019లో కొత్త వినియోగదారుల రక్షణ చట్టం వచ్చింది.




ఆన్లైన్ షాపింగ్ మొదలైన తరువాత వినియోగదారులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల సోషల్ మీడియాలో ఎంతోమంది ఇస్తున్నటువంటి ప్రకటనలు చూసి మోసపోతున్నారు. ఈ మధ్యకాలంలో ముఖ్యంగా సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్అని చెప్పి చాలామంది వినియోగదారులకి చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కాకపోతే అది కొద్ది మంది మాత్రమే పూర్తి అవగాహనతో చెప్పడం జరుగుతుంది, కానీ చాలావరకు తెలిసి తెలియని విషయాలు వారికి తోచిన విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం వల్ల వినియోగదారులు మోసపోతున్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ అవుతున్న వాటికి ఇలాంటి స్క్రూటినీ ఉండదు కాబట్టి వినియోగదారులు కచ్చితంగా వారు చూస్తున్నటువంటి సమాచారం ఎంతవరకు నిజం అనే విషయాన్ని గ్రహించి వాటిని ఒక మార్గదర్శకంగా కాకుండా ఒక సూచి గాని భావించి ఆ ప్రకటన వెనుక ఉన్నటువంటి విషయం గురించి క్షుప్తంగా విచారించిన తర్వాతనే వాటిని తీసుకోవడం లాంటిది చేయాలి. సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉన్నారు అని లేకపోతే ఎక్కువ లైక్స్ వచ్చాయను ఆ వీడియోలో ఉ న్నటువంటి విషయం కచ్చితమైనదని అయినా ఎప్పుడూ గుడ్డిగా నమ్మకూడదు. సోషల్ మీడియాలో వచ్చినటువంటి ప్రకటన ఆధారంగా ఇన్వెస్ట్మెంట్ చేసే ముందు కచ్చితంగా దాని గురించి లోతైన సమాచారం తెలుసుకున్న తర్వాతనే ముందుకు వెళ్లాలి లేనిచో వినియోగదారులు మోసపోవడం జరుగుతుంది. అలానే ఈ మధ్యకాలంలో చాలావరకు వివిధ అంశాల పైన సోషల్



మీడియాలో పోస్టులు వీడియోస్ చేసి పెట్టడం జరుగుతుంది వాటి వల్ల మంచి కన్నా చెడు ప్రభావమే ఎక్కువగా ఉంది. ఎందుకంటే సోషల్ మీడియాలో ఫేమస్అవ్వాలిఅని ఉద్దేశంతో చాలామంది వారికి ఆ విషయం పట్ల పూర్తి అవగాహన లేకపోయినా వారి పోస్ట్ చేయడం వలన అది నమ్మి అది నిజమేమోఅని చాలామంది వినియోగదారులు మోసపోవడం జరుగుతుంది. ఇలాంటి సోషల్ మీడియాలో పోస్ట్ అవుతున్నతప్పుడు సమాచారంపట్ల ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఏర్పాటు చేసే సోషల్ మీడియాలో పోస్ట్ అయిన దాంట్లో ఏది నిజమో కాదో తేల్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

### చట్టం వినియోగదారులకు కల్పిస్తున్న 6 కీలక హక్కులు:

1. భద్రతా హక్కు: ప్రాణాలకు, ఆస్తులకు హాని కలిగించే వస్తువులు, సేవల మార్కెటింగ్ నుండి రక్షణ పొందే హక్కు.
2. సమాచార హక్కు: వస్తువుల నాణ్యత, పరిమాణం, స్వచ్ఛత, ప్రమాణం, ధర వంటి పూర్తి వివరాలు తెలుసుకునే హక్కు, తద్వారా మోసపూరిత పద్ధతుల నుండి రక్షణ పొందడం.
3. ఎంపిక హక్కు: వివిధ రకాల వస్తువులు, సేవల నుండి పోటీ ధరలలో ఎంచుకునే స్వేచ్ఛ.
4. వినబడే హక్కు: వినియోగదారుల ప్రయోజనాలను సరైన వేదికల్లో వినిపించే, ప్రాతినిధ్యం వహించే హక్కు (పరిష్కారం పొందే హక్కు కూడా ఇందులో భాగం).
5. వినియోగదారుల విద్య హక్కు: వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన పొందే హక్కు.
6. ఆరోగ్యకరమైన పర్యావరణం హక్కు: మెరుగైన జీవితానికి అవసరమైన ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని పొందే హక్కు.

ఈ హక్కులు వినియోగదారులను దోపిడీ నుండి కాపాడి, వారికి సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం కలిపిస్తుంది. మీ హక్కులను తెలుసుకోండి, సురక్షితంగా ఉండండి.



**పోగుల నవీన్ కుమార్, అడ్వకేట్**
తెలంగాణ వినియోగదారుల
ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

# ఫర్టిలిటీ.. వ్యాపార ప్రాప్తిరస్తు!

మానవ నాగరికతలో 'సంతానం' అనేది కేవలం ఒక జీవసంబంధమైన ప్రక్రియ మాత్రమే కాదు, అది ఒక సామాజిక హెూదాగా, వారసత్వంగా, భావోద్వేగ అవసరంగా ముడిపడి ఉంది. మారుతున్న జీవనశైలి, ఆలస్యంగా చేసుకుంటున్న వివాహాలు, పెరిగిన ఒత్తిడి, పర్యావరణ కాలుష్యం వంటి కారణాల వల్ల నేడు 'సంతానలేమి' అనేది ప్రపంచవ్యాప్త సమస్యగా మారింది. ఈ క్లిష్ట పరిస్థితిని ఆసరాగా చేసుకుని పుట్టుకొచ్చినవే 'ఫర్టిలిటీ సెంటర్లు'. ఒకప్పుడు కేవలం వైద్య సేవలకే పరిమితమైన ఈ రంగం, నేడు లక్షల కోట్ల రూపాయల టర్నోవర్‌తో ఒక భారీ వ్యాపార సామ్రాజ్యంగా అవతరించింది. భారతదేశంలో ఫర్టిలిటీ పరిశ్రమ శరవేగంగా విస్తరిస్తోంది. తాజా నివేదికల ప్రకారం, దేశంలో ఏటా దాదాపు 15 నుంచి 20 శాతం వృద్ధి రేటుతో ఈ వ్యాపారం కొనసాగుతోంది.




**2025** నాటికి భారతదేశంలో ఐవీఎఫ్ మార్కెట్ విలువ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, ఇప్పుడు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కూడా వీధికి ఒకటి చొప్పున 'టెస్ట్ ట్యూబ్ బేబీ' కేంద్రాలు వెలుస్తున్నాయి. సంతానలేమిని ఒక వ్యాధిగా కంటే, ఒక సామాజిక శాపంగా చూసే ధోరణి మన సమాజంలో ఇంకా బలంగా ఉంది. ఈ బలహీనతనే వ్యాపారవేత్తలు పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. 'మీ ఇంట్లో చిన్నారి చిరునవ్వులు చూడాలనుకుంటున్నారా?' వంటి ఆకర్షణీయమైన ప్రకటనలతో దంపతులను ఆకర్షిస్తున్నారు. మొదటి ప్రయత్నం విఫలమైతే, రెండో ప్రయత్నం ఉచితం లేదా తక్కువ ధరకే అంటూ రకరకాల ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నారు. ఫర్టిలిటీ సెంటర్ల వ్యాపారంలో అత్యంత ఆందోళనకరమైన అంశం 'నైతికత'. లాభార్జనే ధ్యేయంగా పనిచేసే కొన్ని సంస్థలు రోగులకు సరైన సమాచారం ఇవ్వడం లేదు. వాస్తవానికి ఐవీఎఫ్ ప్రక్రియలో విజయ అవకాశాలు 30 నుంచి 40 శాతం మాత్రమే ఉంటాయి. కానీ, ప్రకటనల్లో 80-90 శాతం సక్సెస్ రేటు ఉంటుందని భ్రమపెడుతున్నారు. గర్భం దాల్చే అవకాశం ఉన్నా, లాభం కోసం ఖరీదైన ఐవీఎఫ్ లేదా ఇక్సీ పద్ధతులను సూచిస్తున్నారు. అండాల సేకరణలో దాతలకు ఇచ్చే పరిహారం కంటే, వారి నుంచి వసూలు చేసే రుసుము ఆకాశాన్ని తాకుతోంది. అలాగే, దాతల ఆరోగ్య భద్రతపై సరైన నిఘా ఉండటం లేదు. ఫర్టిలిటీ చికిత్స అనేది నేటికీ సామాన్యుడికి అందుబాటులో లేని 'లగ్జరీ' వైద్యంగానే ఉంది. ఒకే ఒక ఐవీఎఫ్ సైకిల్ కోసం కనీసం 1.5 లక్షల నుండి 3 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ఒకవేళ మొదటిసారి విఫలమైతే, ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోతుంది. ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా సంతానలేమి చికిత్సలను కవర్ చేయకపోవడం పెద్ద లోపం. దీనివల్ల మధ్యతరగతి ప్రజలు అప్పుల పాలవుతున్నారు. సంతానం కోసం ఆరాటపడే దంపతులకు ఈ కేంద్రాలు కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి అనడంలో సందేహం లేదు. కానీ, సైన్స్ వెనుక దాగున్న 'వ్యాపార కోణం' వల్ల సమాజంలో ఒక రకమైన అభద్రతా భావం ఏర్పడుతోంది. గర్భం దాల్చడం అనేది సహజ సిద్ధమైన ప్రక్రియ కాకుండా, ఒక 'కొనుగోలు వస్తువు'గా మారుతోంది. ఈ వ్యాపార ధోరణిని అదుపు చేసి, వైద్య సేవలను పారదర్శకం చేయడానికి చర్యలు అవసరం. ప్రభుత్వం ఫర్టిలిటీ చికిత్సల గరిష్ట ధరలను నిర్ణయించాలి. సంతానలేమికి కేవలం వైద్యమే కాకుండా, యోగా, మంచి ఆహారం, ఒత్తిడి తగ్గించుకోవడం వంటి సహజ మార్గాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి. క్లినిక్‌లకు వచ్చే దంపతులకు కేవలం చికిత్స గురించే కాకుండా, దానివల్ల కలిగే మానసిక, ఆర్థిక పరిణామాలపై నిజాయితీగా కౌన్సెలింగ్ ఇవ్వాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా అత్యాధునిక ఐవీఎఫ్ సదుపాయాలను ఉచితంగా లేదా తక్కువ ధరకే అందించాలి. అప్పుడే కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. బిడ్డను పొందాలనే కోరిక ప్రతి మనిషికి సహజం. ఆ కోరికను వ్యాపారంగా మార్చుకుని కోట్లు గడించడం అనైతికం. వైద్యం అనేది సేవా దృక్పథంతో సాగాలి కానీ, ఒక ఫ్యాక్టరీలాగా కాదు. ఫర్టిలిటీ సెంటర్లు ఆశలను అమ్మే అంగళ్లుగా మారకుండా, శాస్త్రీయతను, మానవత్వాన్ని జోడించి సేవలందించినప్పుడే ఆ బిడ్డల చిరునవ్వులకు నిజమైన అర్థం ఉంటుంది. ప్రభుత్వ నియంత్రణ, ప్రజల అవగాహన, వైద్యుల చిత్తశుద్ధి కలిసినప్పుడే ఈ రంగంలో ప్రక్షాళన సాధ్యమవుతుంది.

**- మణికంఠ శర్మ, ప్రకృతి వైద్య నిపుణుడు, హైదరాబాద్**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.